

అభివృద్ధితోనే అడుగులు



నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్

1 ఏడాదిలో ఏం చేశారు?

ఆచితూచి అడుగు వేస్తారు. తడుముకోరు. తడబాటు ఉండదు. క్లుప్తంగా, సూటిగా, స్పష్టంగా మాట్లాడతారు. నగరి ఎమ్మెల్యేగా గెలిచిన తొలి ఏడాదిలోనే తండ్రికి తగ్గ తనయుడు అనిపించుకున్నారు గాలి భానుప్రకాష్. రాజకీయాల్లో ఢక్కాముక్కీలు తిన్న కుటుంబానికి వారసుడిగా తొలి ఓటమిని ఎదుర్కొన్న గాలి భానుప్రకాష్ 2024లో గెలుపును సొంతం చేసుకున్నారు. ఫైర్‌బ్రాండ్ రోజా నోటినీ, ఆమె వర్గం రాజకీయ వ్యూహాలనూ సమర్థంగా ఎదుర్కొంటూ ఆరితేరారు. అలివిగాని మాటలు చెప్పరుగానీ, చెప్పినవన్నీ చేస్తారన్న పేరును మాత్రం జనంలో తెచ్చుకున్నారు. తొలి ఏడాది కాలంలో నగరి ఎమ్మెల్యేగా గాలి భానుప్రకాష్ ఏం సాధించారు? ఇంకా ఏమి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. సీఎం దృష్టికి ఆయన తీసుకువెళ్లిన అంశాలేమిటి.. వీటిపై గాలి భానుప్రకాష్‌తో ఆంధ్రజ్యోతి సంభాషణలోని ముఖ్యాంశాలు...

- 6వ పేజీలో -

రేషన్‌కు 'సర్వర్' కష్టాలు



చంద్రగిరి మండలంలో సర్వర్ పనిచేయక అవస్థలు పడుతున్న కార్డుదారులు


● తొలిరోజు మందకొడిగా సరుకుల పంపిణీ

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రేషన్ సరకుల పంపిణీకి సర్వర్ కష్టాలు వెంటాడాయి. దీంతో తొలిరోజైన శుక్రవారం పంపిణీ మందకొడిగా ప్రారంభమైంది. ఈ నెలలోనూ కందిపప్పు ఇవ్వడం లేదు. ఉచిత బియ్యంతో పాటు అరకిలో చక్కెర పంపిణీ చేశారు. జిల్లాలోని 5,91,259 బియ్యం కార్డులున్నాయి. చాలా చోట్ల సర్వర్ పనిచేయక.. సరుకుల పంపిణీ జరగకపోవడంతో కార్డుదారులు గంటల తరబడి వేచి ఉండి వెనుదిరిగారు. తిరుపతి నగరం బాలాజీకాలనీ, శివజ్యోతినగర్, రైల్వే కాలనీ, సత్యనారాయణపురం, చెన్నారెడ్డికాలనీ, ఎంఆర్‌పల్లి, బాలాయపల్లి, గూడూరు, వాకాడు, వంటి ప్రాంతాల్లో కొందరు డీలర్లు దుకాణాలు తెరచి కాసేపు ఉండిపోయినట్లు సమాచారం. దీంతో ఉదయం దాదాపు 12 దుకాణాలు తెరుచుకోలేదు. ఇవన్నీ మధ్యాహ్నం నుంచి తెరుచుకున్నా కార్డుదారులు డీలర్లు వస్తారో రారో అనే అనుమానంతో శనివారం తీసుకుందాములే అని రానట్లు తెలిసింది. శుక్రవారం సాయంత్రానికి 23.4 శాతం నిత్యాసర వస్తువుల పంపిణీ జరిగిందని డీఎస్‌వో శేషాచలం రాజు చెప్పారు.

రైతుల ఖాతాల్లో నేడు రూ.7 వేల చొప్పున నగదు జమ

'సూపర్ సిక్స్' హామీల్లో మరొకటి అమల్లోకి

అన్నదాతా సుఖీభవ!





తిరుపతి (ఎంఆర్‌పల్లె), ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సందర్భంగా టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు ఇచ్చిన 'సూపర్ సిక్స్' హామీల్లో ఒకటైన 'అన్నదాత సుఖీభవ' పథకం శనివారం అమల్లోకి రానుంది. అన్నదాతలకు ప్రోత్సాహకంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పీఎం కిసాన్ యోజన, అన్నదాత సుఖీభవ పథకాల కింద ఒక్కో రైతుకు రూ.7వేల చొప్పున బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నాయి. 2014-19లో అధికారంలో ఉన్న టీడీపీ 'అన్నదాత సుఖీభవ' కింద రైతులకు పెట్టుబడి సాయం అందించే ఈ పథకాన్ని ప్రారంభించింది. వైసీపీ హయాంలో రైతు భరోసాగా పేరు మార్చి రూ.13,500 (రాష్ట్రం వాటా రూ.7500, కేంద్ర వాటా రూ.6500) మాత్రమే ఇచ్చేవారు. కూటమి ప్రభుత్వం మరో రూ.6,500 పెంచి రూ.20వేలు ఇవ్వనుంది. ఇందులో రాష్ట్ర వాటా రూ.14వేలు కాగా, కేంద్ర వాటా రూ.6వేలు. గతంలో మాదిరిగానే ఏప్రిల్- జూలై వరకు.. ఆగస్టు-నవంబరు వరకు.. డిసెంబరు-మార్చి వరకు.. ఇలా మూడు విడతల్లో ఈ సొమ్ము రైతుల బ్యాంకు ఖాతాల్లో జమకానుంది. రాష్ట్ర ప్రభుత్వం తొలి, మలి విడతల్లో రూ.5వేలు చొప్పున, మూడో విడతలో రూ.4వేలు ఇవ్వనుండగా, కేంద్ర ప్రభుత్వం ఒక్కో విడతలో రూ.2వేల చొప్పున ఇవ్వనుంది. వ్యవసాయ శాఖ గణాంకాల ప్రకారం జిల్లాలో ఈ పథకం కింద 1,54,908మంది రైతుల ఖాతాల్లో శనివారం రూ.7 వేల చొప్పున నగదు జమ కానుంది.

అర్హులైన రైతులు : 1,54,908 మంది
జమయ్యే నగదు : రూ.7వేల చొప్పున రూ.105.18 కోట్లు
రాష్ట్రం వాటా : రూ.5 వేల వంతున రూ.77.45 కోట్లు
కేంద్రం వాటా : రూ.2 వేల చొప్పున రూ.27.73 కోట్లు

అర్హతను తెలుసుకోండిలా..

అన్నదాత సుఖీభవకోసం: రైతులు తమ వాట్సాప్ ద్వారా 95523 00009 (వాట్సాప్ గవర్నెన్స్ మనమిత్ర) నెంబరుకు 'హాయ్' మెసేజ్ పంపాలి. ఆ తర్వాత సేవను ఎంచుకుని.. అన్నదాత సుఖీభవపై క్లిక్ చేయాలి. ఆధార్ నెంబరు నమోదుచేస్తే వివరాలు వస్తాయి. అందులో రైతులు అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులా.. అనర్హులా అనే వివరాలు వస్తాయి. అనర్హులైతే అందుకు కారణమూ ఉంటుంది. రైతుల ఈకేవైసీ పూర్తయిందో లేదో కూడా తెలిసి పోతుంది. అదే విధంగా అధికార పోర్టల్‌లోనూ రైతులు చెక్ చేసుకోవచ్చు.

పీఎం కిసాన్: రైతులకు 20వ విడత పీఎం కిసాన్ కింద రూ.2వేలు రావాలంటే తమ బ్యాంకు ఖాతాకు ఆధార్‌లింక్, ఈకేవైసీ పూర్తి చేసుకోవాలి. దీనికి 'పీఎంకిసాన్.జీవోవి.ఇన్' వెబ్‌సైట్‌లో తెలుసుకోవాలి. అందులో పేరుందో లేదో కూడా రైతులు తెలుసుకోవచ్చు.

అనర్హతకు కారణాలు

● గత ఆర్థిక సంవత్సరంలో ఆదాయపుపన్ను చెల్లించిన వారు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, రూ.10వేలు, అంతకంటే ఎక్కువ పింఛను పొందేవారు.

● కుటుంబాన్ని యూనిట్‌గా తీసుకుని అమలు చేయడం వల్ల ఒక కుటుంబలో నలుగురి పేరిట భూమి ఉంటే వారిలో ఒకరికే లబ్ధి కలగనుంది.

● వ్యవసాయ భూమిని ఇంటి స్థలాలుగా మార్చినా, ఆక్వా రైతులకు, వ్యవసాయేతర భూమి కలిగిన వారూ అనర్హులు. పది సెంట్లకంటే తక్కువ భూమి ఉంటే ఈ పథకం వర్తించదు. వెబ్‌ల్యాండ్‌లో పేరు లేకున్నా.. 18 ఏళ్ల కంటే తక్కువ వయసున్నా.. ఈకేవైసీ పూర్తి కాని రైతులూ అనర్హులే. కాగా, విదేశాలు, ఇతర రాష్ట్రాల్లో కొందరు ఉండగా, బయోమెట్రిక్‌లో వేలిముద్రలు పడకపోవడంతో కొందరికి సమస్యగా ఉంది.

అర్హత కోసం చేయండిలా..

వ్యవసాయ భూమి ఉన్నరైతు చనిపోయి ఉంటే వారి ఖాతాను వారసులకు మ్యుటేషన్ చేసుకోవడం. వెబ్ ల్యాండ్‌లో రైతుసాగు భూమికి ఇతర రైతుల ఆధార్ లింక్ అయిన రైతులు, సాగు భూమికి ఆధార్‌లింక్ కానీ రైతులు మండల రెవెన్యూ అధికారులను సంప్రదించాలి. అధికారులు సరిచేశాక ఈ పథకానికి అర్హులవుతారు. ఇక ఎన్‌పీసీఐ ఇన్‌యాక్టివ్ రైతులు సంబంధిత బ్యాంకు అధికారులను సంప్రదించి యాక్టివ్ చేసుకోవాలి. ఎన్‌పీసీఐ మ్యాపింగ్ కాని వారు.. తమ బ్యాంకు ఖాతాను, ఆధార్ నెంబర్‌ను ఎన్‌పీసీఐకి మ్యాపింగ్ చేసుకున్నాక నగదు జమవుతుంది.

- ప్రసాదరావు, జిల్లా వ్యవసాయాధికారి

2,50,829 మందికి పింఛన్ల పంపిణీ

● రాష్ట్రంలో జిల్లాకు రెండో స్థానం



ఇరకం దీవిలో పింఛన్లను పంపిణీ చేస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే విజయశ్రీ

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్ల నగదును 2,50,829 మందికి పంపిణీ చేశారు. శుక్రవారం ఉదయం 6.30 గంటలకే సచివాలయ సిబ్బంది ఇంటింటికి వెళ్లి పింఛన్లు అందజేశారు. 2,63,743మందికి గాను రాత్రి వరకు 2,50,829 మందికి రూ.107.26 కోట్ల నగదు అందించారు. తద్వారా పింఛన్ల పంపిణీలో జిల్లాకు రెండో స్థానం దక్కింది. ఇక, ఇంటికి పెద్ద దిక్కు కోల్పోయి వేదన అనుభవిస్తున్న వితంతువులకు కూటమి ప్రభుత్వం అండగా నిలిచింది. కొంతకాలంగా ఊరిస్తున్న భాగస్వామ్య పింఛన్లు శుక్రవారం అందజేశారు. జిల్లాలో 4,800 మందికి భాగస్వామ్య (స్పౌజ్) పింఛన్లకు లబ్ధిపొందారు. తడ మండలం ఇరకం దీవిలో ఎమ్మెల్యే నెలవల విజయశ్రీతో కలిసి కలెక్టర్ వెంకటేశ్వర్ పింఛన్లు పంపిణీ చేశారు. ఆయా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు. భాగస్వామి పింఛన్ల ప్రక్రియ నిరంతరం సాగుతుందని డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు, ఏపీడీ ప్రభావతి తెలిపారు.

560 వాహనాల సైలెన్సర్లు, లౌడ్ హారన్లు ధ్వంసం



తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు1(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో అధిక ధ్వని కాలుష్యం కలిగిస్తూ ఇబ్బందికరంగా తయారైన దాదాపు 560 వాహనాల సైలెన్సర్లు, లౌడ్ హారన్లను ధ్వంసం చేశారు. తిరుపతిలోని పోలీసు పరేడ్ మైదానంలో శుక్రవారం ఎస్పీ హర్షవర్ధనరాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఇందులో 60 ద్విచక్రవాహనాల సైలెన్సర్లు, మరో 500 వాహనాల లౌడ్ హారన్లు ఉన్నాయి. 1988లోని సెక్షన్ 190(2) ప్రకారం జరిమానాలు విధించినట్లు ఎస్పీ చెప్పారు. వాహనాలకు అమర్చిన అధిక శబ్దం కలిగించే హారన్లు తొలగించాక ఒరిజనల్ హారన్లు, సైలెన్సర్లు బిగించాకనే వాహనాలను యజమానులకు తిరిగిస్తామన్నారు. శబ్ద కాలుష్యంలేని హారన్లు, సైలెన్సర్లు వాడాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ డీఎస్పీ రామకృష్ణమాచ్చారి, సీఐలు సంజీవ్‌కుమార్, ఎస్ఐలు పురుషోత్తమ రెడ్డి, విజయలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

● అదనపు లోడ్డు క్రమబద్ధీకరణకు

డిసెంబరు 31వరకు గడువు

తిరుపతి(ఆటోనగర్), ఆగష్టు1(ఆంధ్రజ్యోతి): సదరన్ డిస్కం పరిధిలోని గృహ విద్యుత్ వినియోగదారులు 50 శాతం రాయితీతో డిసెంబరు 31వ తేదీలోపు అదనపు లోడ్‌ను క్రమబద్ధీకరించుకోవాలని ఆ సంస్థ సీఎండీ కె.సంతోషరావు శుక్రవారం తెలిపారు. రాష్ట్రంలో క్రమబద్ధీ కరణ చేసుకోవలసిన విద్యుత్ వినియోగదారులు ఎక్కువగా ఉండటంతో ఈ గడువును ఏడాది చివరి వరకు పొడిగించి నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి(ఏపీఈఆర్‌సీ) రాయితీ కల్పించి ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. విద్యుత్ వినియోగదారులు నూతనంగా సర్వీసు తీసుకొనే సమయంలో దరఖాస్తులో పొందు పరచిన లోడ్ కంటే అదనంగా వినియోగిస్తున్న వారు పెరిగిన లోడ్‌కు అనుగుణంగా ఒక కిలోవాట్‌కు 50 శాతం రాయితీతో క్రమబద్ధీకరించుకోవాలన్నారు.

తిరుమల చేరుకున్న కేంద్రమంత్రి గడ్కరీ

తిరుమల/ తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ శ్రీవారి దర్శనార్థం శుక్రవారం రాత్రి తిరుమలకు చేరుకున్నారు. తిరుమలలోని వకుళమాత నిలయం గెస్ట్ హౌస్ వద్ద ఆయనకు టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరీ స్వాగతం పలికారు. రాత్రికి తిరుమలలోనే బస చేసి, శనివారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో శ్రీవారిని దర్శించుకోనున్నారు. అనంతరం ఉదయం 10గంటలకు తిరుచానూరు పద్మావతి అమ్మవారిని దర్శించుకుంటారు. 10.30గంలకు తిరుపతిలోని కంచికామ కోటిపీఠానికి చేరుకుని అక్కడ జరిగే కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 12.40గంటలకు రేణిగుంట విమానాశ్రయం నుంచి విజయవాడకు బయలుదేరి వెళ్లనున్నారు.




కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి స్వాగతం పలుకుతున్న టీటీడీ అదనపు ఈవో

ద్రావిడ భాషా సాహిత్య కల్పతరువు!

● అమెరికాలో కన్నుమూసిన ప్రొఫెసర్ గంగిశెట్టి లక్ష్మీనారాయణ

● ఆయన సాహిత్య సేవలు అనన్యం



ద్రావిడ విశ్వవిద్యాలయం మాజీ వీసీ గంగిశెట్టి లక్ష్మీనారాయణ మరణం సాహిత్య వర్గాలను శోకసముద్రంలో ముంచెత్తింది. శుక్రవారం అమెరికాలో తన కుమారుడి ఇంట్లో 78 ఏళ్ల వయసులో ఆయన కన్నుమూశారు. మారుమూల కుప్పంలో మరుగున ఉండిపోయిన ద్రావిడ విశ్వవిద్యాలయాన్ని ఎనలేనంతగా అభివృద్ధి చేసి, ద్రావిడ భాషా రాష్ట్రాల పర్యంతం పేరుగల వర్సిటీగా నిలబెట్టిన ఘనత ఆచార్య గంగిశెట్టి లక్ష్మీనారాయణకే దక్కుతుంది. ద్రావిడ భాషా సాహిత్యాలకు, ద్రావిడ విశ్వవిద్యాలయం అభివృద్ధికి ఆయన చేసిన కృషిని ఈ సందర్భంగా సాహిత్య వర్గాలు మననం చేసుకుంటున్నాయి.

కుప్పం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): తెలుగు వెలుగు ఎన్టీ రామారావు మానస పుత్రికగా ద్రావిడ విశ్వవిద్యాలయం 1997లో స్థాపితమైంది. ఏర్పడనైతే ఏర్పడింది కానీ,అప్పటి విశ్వవిద్యాలయంలో కేవలం హిస్టరీ, ఫిలాసఫీ, జానపద గిరిజన అధ్యయన శాఖలు మాత్రమే ఉండేవి. ఈ దశలో 2005 ఆగస్టు 8న ప్రొఫెసర్ గంగిశెట్టి లక్ష్మీనారాయణ ద్రావిడ విశ్వవిద్యాలయం 3వ ఉప కులపతిగా బాధ్యతలు తీసుకున్నారు. 2008 ఆగస్టు 4న పదవీ విరమణ చేసేదాకా ద్రావిడ వర్సిటీకి స్వర్ణయుగమే నడిచిందని చెప్పవచ్చు. ద్రావిడ భాషలైన తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, తుళులతోపాటు వీటిని అనుసంధానించడానికి ఆంగ్ల అధ్యయన శాఖలను ఆయన ప్రారంభించారు. ఆయా భాషా శాస్త్రాల్లో నిష్ణాతులైన సీనియర్ ఆచార్యులను ఎంపిక చేసి కోరి మరీ నియమించుకున్నారు. మరోవైపు యూనివర్శిటీ తరఫున ప్రసారాంగ పేరుతో ప్రచురణల సంస్థను స్థాపించి ద్రావిడ భాషల్లో ప్రసిద్ధులైన రచయితల రచనలను ముద్రించారు. దీన్ని క్రియాశీలకంగా పని చేయించడానికి 18 పోస్టులు సృష్టించారు. ఆయా భాషల్లో మాత్రమే అయితే కేవలం ఆ భాషా పాఠకులకు మాత్రమే పరిమితం అవుతుందని భావించి, ఒక భాషనుంచి ఇంకో భాషకు అనువాదం చేసేందుకు ప్రసారాంగకు అనుబంధంగా అనుసృజన పేరుతో అనువాద శాఖను నెలకొల్పారు. ఈ శాఖకు ప్రఖ్యాత కవి దివంగత వేగుంట మోహన్ ప్రసాద్‌ను ఒప్పించి డైరెక్టర్‌గా నియమించారు. గంగిశెట్టి లక్ష్మీనారాయణ హయాంలో ప్రసారంగ, దానికి అనుబంధమైన అనుసృజన శాఖలు అనేక ప్రసిద్ధ ప్రచురణలు, అనువాదాలతో ఒక వెలుగు వెలిగాయి. కందుకూరి వీరేశలింగం నవల రాజశేఖర చరిత్రము తెలుగునుంచి వివిధ ద్రావిడ భాషలకు అనువాదం చేయడం అప్పుడే జరిగింది. అంతేకాదు, తెలుగు వాళ్లు గర్వించే రచయిత రాచకొండ విశ్వనాథ శాస్త్రి రచనలు కూడా ద్రావిడ భాషలకు అప్పుడే అనువాదమయ్యాయి. సంజీవదేవ్ హస్త రేఖలు నవలను సైతం వివిధ భాషల్లోకి అనువదించారు. తిరుమల రామచంద్ర ఆత్మకథ 'హంపీ నుంచి హరప్పా దాక' తెలుగు నుంచి ఇతర ద్రావిడ భాషల్లోకి గంగిశెట్టి లక్ష్మీనారాయణే అనువాదం చేయించారు.జ్ఞానపీఠ అవార్డు గ్రహీత అయిన కన్నడ రచయిత ఎస్.ఎల్. భైరప్ప 'పర్వ' నవల సైతం ఆ భాషనుంచి సాటి ద్రావిడ భాషల్లోకి లక్ష్మీనారాయణచే అనువదించబడి ఆయా భాషల్లోని సాహిత్యాభిమానులను అలరించింది. 2004లో ఈ అనువాదానికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది.గంగిశెట్టి లక్ష్మీనారాయణ ద్రావిడ భాషా సంస్కృతులకు సంబంధించిన అనేక వ్యాసాలు, రచనలు చేశారు. పలు ద్రావిడ భాషలకు చెందిన ప్రసిద్ధ భాషా శాస్త్రవేత్తలను గుర్తించి, వారికి గౌరవ డాక్టరేట్లను ప్రదానం చేశారు.

ద్రావిడ వర్సిటీకి స్వర్ణయుగం

ఆచార్య గంగిశెట్టి లక్ష్మీనారాయణ హయాంలోనే ద్రావిడ విశ్వవిద్యాలయానికి యూజీసీ గుర్తింపు లభించింది. దీంతో యూజీసీ నిధులు మంజూరై వర్సిటీ అభివృద్ధికి తోడ్పడ్డాయి. అంతేకాదు, తమిళనాడు, కర్ణాటక తదితర ద్రావిడ రాష్ట్రాల నుంచి ప్రత్యేక నిధులు రాబట్టి, యూనివర్శిటీలోని ఆయా శాఖల అభివృద్ధికి వినియోగించారు.విశ్వవిద్యాలయ ఆవరణలోని అక్కమహాదేవి బాలికల వసతి గృహ నిర్మాణానికి గంగిశెట్టి హయాంలోనే కర్ణాటక ప్రభుత్వం రూ.50 లక్షల నిధులు ఇచ్చింది. ఇంకా కర్ణాటక ఇచ్చిన రూ.10 లక్షల నిధులతో తుళు అధ్యయన పీఠాన్ని ఏర్పాటు చేశారు. మూలికావనం కూడా ఆయన ఆలోచన నుంచి ఉద్భవించిందే.కేవలం భాషా శాఖలే కాదు- బయోటెక్నాలజీ, కెమిస్ట్రీ, కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్, మ్యాథ్స్ అండ్ స్టాటిస్టిక్స్, లాంగ్వేజ్ టీచింగ్ టెక్నాలజీ, ఎంబీయే, ఎంసీయే వంటి ఆధునిక ఉపాధి రంగానికి అవసరమైన కోర్సులన్నింటినీ ప్రవేశపెట్టిన ఘనత కూడా ఆయనకు దక్కుతుంది.ద్రావిడ విశ్వవిద్యాలయ తొట్టతొలి కాన్వకేషన్‌ను 2007లో లక్ష్మీనారాయణే ప్రారంభించారు. పదవీ విరమణ చేసే ముందు 2008వ సంవత్సరంలో సైతం తమిళనాడు ప్రభుత్వంనుంచి టీచింగ్ పోస్టులు సాధించగలగడం ద్రావిడ విశ్వవిద్యాలయం పట్ల గంగిశెట్టి చిత్తశుద్ధికి నిదర్శనం. కాగా ద్రావిడ విశ్వవిద్యాలయానికి ఒక గుర్తింపును తెచ్చిన సాహిత్య వేత్త మరణం ద్రావిడ భాషామ తల్లికి తీరని లోటని ఆంగ్లశాఖ ఆచార్యుడు తిరుపతిరావు వ్యాఖ్యానించారు.

రాజకీయాలకతీతంగా అభివృద్ధి



శంఖంపల్లె పంచాయతీలో పెన్షన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నాని

పాకాల, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): రాజకీయాలకతీతంగా చంద్రగిరి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే పులివర్తి నానీ అన్నారు. మండలంలోని శంఖంపల్లె పంచాయతీ పరిధిలో శుక్రవారం ఆయన ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పెన్షన్లు పంపిణీ చేశారు. లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ అందజేసి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పెన్షన్లు క్రమం తప్పకుండా లబ్ధిదారులకు ఇంటికి వెళ్లి అందజేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామాలలో ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ నంగా పద్మజరెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ బి.నాగరాజనాయుడు, సింగిల్ విండో ఛైర్‌పర్సన్ కె.సావిత్రి, తహసీల్దార్ సంతోష్‌సాయి, ఎంపీడీవో శశిరేఖ పాల్గొన్నారు.

అదను చూసి కాలువస్థలం ఆక్రమణ

గ్రామస్తులతో కలసి అడ్డుకున్న రెవెన్యూ అధికారులు



ఎక్స్‌కవేటర్‌సాయంతో పునాదిగుంతను పూడ్చుతున్న దృశ్యం, పక్కన సర్పంచ్, వీఆర్వోలు, గ్రామస్తులు

తిరుపతిరూరల్, ఆగస్టు1(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం అవిలాల పంచాయతీలో కొందరు అదను చూసి విలువైన ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలకు తెరలేపారు. పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారిని ఆనుకుని ఉండటంతో ఈ భూములు చాలా ఖరీదైనవి. దీంతో ఆక్రమణదారుల కన్ను వీటిపై పడింది.



ప్రభుత్వ స్థలంలో చేపడుతున్న నిర్మాణం వద్ద సామగ్రిని తీసుకెళుతున్న పంచాయతీ సిబ్బంది

గుట్టుచప్పుడు కాకుండా ఆక్రమణలకు దిగుతున్నారు. ఈ క్రమంలో అవిలాల లెక్కదాఖలా సర్వేనంబరు 481లోని ప్రభుత్వ కాలువ స్థలంలో ఆక్రమణదారులు పునాది గుంత తీసి నిర్మాణ పనులను ప్రారంభించారు. నిర్మాణానికి అవసరమైన సిమెంటు రాళ్లను ఈ స్థలంలో అందుబాటులో ఉంచారు. దీనిపై రూరల్ తహసీల్దార్ రామాంజులునాయక్‌కు ఫిర్యాదు అందడంతో ఆయన ఆదేశాల మేరకు గ్రామస్తులతో వీఆర్వోలు రామిరెడ్డి, రమేష్, మురళి కలసి స్థలాన్ని సందర్శించి అక్రమ నిర్మాణాన్ని అడ్డుకున్నారు. నిర్మాణానికి తీసిన పునాదిగుంతను ఎక్స్‌కవేటర్ సాయంతో పూడ్చేశారు. అలాగే దీనికి సమీపంలోని సర్వేనంబరు 486లోని ప్రభుత్వ భూమిలోనూ కొందరు అక్రమ నిర్మాణాన్ని చేపడుతున్నారన్న సమాచారంతో గ్రామస్తులతో కలిసి సర్పంచ్ చెందిలి వెంకటరమణ, ఉపసర్పంచ్ కవితా గోపాల్ కలసి పరిశీలించారు. గ్రామస్తుల సూచన మేరకు నిర్మాణ పనులకు సంబంధించిన సామగ్రిని(తట్టలు, ఇనుపనిచ్చెన, వాటర్‌డమ్) పంచాయతీ సిబ్బంది తీసుకెళ్లారు.

భాగస్వామ్య పింఛన్ల పంపిణీ



పింఛన్లు అందజేస్తున్న తిరుమలరెడ్డి

రామచంద్రాపురం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయలచెరువుపేట గ్రామంలో భాగస్వామ్య పింఛన్లు పంపిణీ చేశారు. టీడీపీ మండలాధ్యక్షుడు తిరుమలరెడ్డి మాట్లాడుతూ మండలంలోని 23 పంచాయతీల్లో 92మందికి భాగస్వామ్య పింఛన్లు మంజూరయ్యాయని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సరిగా లేకపోయినా సీఎం చంద్రబాబు చొరవ తీసుకుని కొత్త పింఛన్లు అందజేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో అధ్యక్షుడు జనార్దన్‌చౌదరి, మాజీ ఎంపీపీ బిందుమాదవి, జిల్లా నాయకులు హరిప్రసాద్, జేడీ జగన్, ఉమాపతినాయుడు, నరసింహారెడ్డి, గిరినాయుడు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే పేదరిక నిర్మూలన



ఇంటింటి ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

రామచంద్రాపురం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాతే పేదరిక నిర్మూలన జరిగిందని సింగిల్‌విండో అధ్యక్షుడు జనార్దనచౌదరి అన్నారు. మండలంలోని పద్మవల్లిపురం గ్రామంలో శుక్రవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. జనార్దనచౌదరి మాట్లాడుతూ టీడీపీ పాలనలో బీసీలు అభివృద్ధి చెందడంతో పాటు రాజకీయ నాయకులుగా ఎదిగారన్నారు. మాజీ కార్యదర్శి జీవరత్నం మాట్లాడుతూ జగన్ పాలనలో అధోగతి పాలైన రాష్ట్రాన్ని సీఎం చంద్రబాబు అభివృద్ధి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో యువత అధ్యక్షుడు ప్రసాద్‌నాయుడు, వాసుయాదవ్, సోమశేఖర్‌నాయుడు, జగదీష్ పాల్గొన్నారు.

వైభవంగా కామాక్షి అమ్మవారికి తిరుమంజనం

రామచంద్రాపురం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): రాయలచెరువుకట్ట కామాక్షి సమేత కోటిలింగేశ్వర స్వామి ఆలయంలో కామాక్షమ్మకు శ్రావణ శుక్రవారం సందర్భంగా తిరుమంజనం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో విశేష పూజలు చేశారు. అమ్మవారికి సుగంధ పరిమళ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించి విశేషంగా అలంకరించారు. ఆలయంలో భక్తుల సందడి నెలకొంది.

ఆకట్టుకున్న పాండవ జననం

రామచంద్రాపురం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ఎస్‌ఆర్ కమ్మపల్లె మహాభారత ఉత్సవాలలో భాగంగా భాగవతారిణి జ్యోత్స్న వినిపించిన పాండవ జననం సభికులను ఆకట్టుకుంది. పాండురాజుకు శాపం కారణంగా కుంతీదేవి యమధర్మరాజు, వాయుదేవుడు, ఇంద్రుడు ద్వారా ధర్మరాజు, భీముడు, అర్జునుడు, మాద్రి అశ్వినీ దేవతల ద్వారా నకుల సహదేవుల జన్మ ఘట్టాలను రమ్యంగా వినిపించారు. అంతకు ముందు ఆలయంలో ద్రౌపదీ సమేత ధర్మరాజుల మూలమూర్తులకు తిరుమంజనం నిర్వహించి, ప్రత్యేక అలంకరణ చేపట్టారు. సాయంత్రం మేళ తాళాల నడుమ ఉత్సవమూర్తులను ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త రమేష్‌బాబు, గ్రామపెద్ద మార్కొండయ్యనాయుడు, ప్రధాన అర్చకుడు హరిస్వామి పాల్గొన్నారు.

స.హ.చట్టంతో ప్రజాస్వామ్యం బలోపేతం



జాస్మిన్‌ను అభినంధిస్తున్న అధ్యాపకులు

పాకాల, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టం ద్వారా దేశంలో ప్రజాస్వామ్యం బలోపేతం అవుతుందని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ రమేష్ కుమార్ అన్నారు. శుక్రవారం కళాశాలలో సమాచార హక్కు చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వ్యవస్థలో పారదర్శకత జవాబుదారీ తనం పెంచాలనే లక్ష్యంతో సమాచార హక్కు చట్టానికి రూపకల్పన చేశారన్నారు. విద్యార్థులకు వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. జిల్లా స్థాయిలో వ్యాసరచన పోటీల్లో ద్వితీయస్థానం సాధించిన ఎస్‌కె.జాస్మిన్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ మాసిలామణి, అధ్యాపకులు ఆదిశేఖరరెడ్డి, చిట్టికళావతి, ఈశ్వరబాబు, రమణమ్మ, రేఖ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి ఘన సన్మానం



సుభాష్ చంద్రబోస్‌ను సత్కరిస్తున్న ఎంఈవోలు బాబ్జీ, లింగయ్య, ఉపాధ్యాయులు

పాకాల, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుందేటివారిపల్లె మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు సుభాష్ చంద్రబోస్‌ను శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఉద్యోగ విరమణను పురస్కరించుకుని మండల కేంద్రంలోని ఎస్వీఎస్ పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంఈవోలు బాబ్జీ, లింగయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, బంధుమిత్రులు ఆయనను ఘనంగా సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు. ఆయన విద్యారంగానికి చేసిన సేవలను కొనియాడారు.

పెట్రోల్ బంకుల్లో తనిఖీలు

● రెండు పంపుల్లో తేడాలపై కేసు నమోదు



తిరుపతి (నేరవిభాగం), ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): తిరుపతి విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ కరీముల్లా షరీఫ్ ఆదేశాల మేరకు శుక్రవారం మధ్యాహ్నం 3 నుంచి రాత్రి 7 గంటల పెట్రోల్ బంకుల్లో తనిఖీలు చేశారు. నగరంలోని రామానుజన్ సర్కిల్ వద్ద పద్మావతి ఫిల్లింగ్ స్టేషన్‌లో సీఎస్‌డీటీ గంగయ్య, లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, అధికారులు కలిసి తనిఖీ చేశారు. 10 పంపులలో రెండు (సాధారణ, హై స్పీడ్) పెట్రోల్ పంపుల్లోని కొలతలలో వ్యత్యాసం ఉండటాన్ని గమనించారు. దీనిపై లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ కేసు నమోదుచేసి రెండు పంపులను సీజ్ చేశారు.

జానపద కళాకారులకు సన్మానం



జానపద కళాకారులను సన్మానిస్తున్న అధ్యాపకులు

పాకాల, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో మన సంస్కృతి కళాసంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం జానపద పాటల కార్యక్రమం నిర్వహించారు. మన సంస్కృతి, సంప్రదాయాలు, అలవాట్లు అంతరించిపోకూడదన్నారు. విద్యార్థుల్లో చైతన్య, స్త్రీ విద్య ప్రాధాన్యాన్ని పాటల రూపంలో పాడారు. జానపద కళాకారులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి.రెడ్డిరామరాజు, కళాసంస్థ ప్రధాన కార్యదర్శి రెడ్డెప్ప, నిర్వాహకులు డాక్టర్ ఆమూరి సుబ్రమణ్యం, జగన్మోహన్ పాల్గొన్నారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం



వెన్నెలకు ఆర్థిక సాయం అందజేస్తున్న హెచ్‌ఎం మోహన్

పాకాల, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్వీఎస్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి వరకు చదివి, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి వరకు, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్‌లో అత్యుత్తమ మార్కులు సాధించిన వెన్నెలను శుక్రవారం అభినందించారు. ఎస్వీఎస్ పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసిన మోహన్ ఆధ్వర్యంలో నిర్వహించే శ్రీలక్ష్మీ సరస్వతి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ద్వారా రూ.10వేలు అందజేశారు. చదువులో మరింతగా రాణించాలని కోరారు. ఎంఈవో బాబ్జీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మల్లగుంటలో పింఛన్ల పంపిణీ



పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎంపీడీవో రామచంద్ర, టీడీపీ నేతలు

తిరుపతిరూరల్, ఆగస్టు1(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం మల్లగుంట గ్రామంలో శుక్రవారం సామాజిక పింఛన్లు పంపిణీ చేశారు. ఎంపీడీవో కె.రామచంద్ర హాజరై ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసిన పింఛన్లను లబ్ధిదారులకు అందించారు. పంచాయతీ కార్యదర్శి ఎం.లక్ష్మీదేవి, టీడీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు పార్లపల్లి మునికృష్ణారెడ్డి, అవిలాల దిలీప్‌కుమార్ యాదవ్ పాల్గొన్నారు.

తల్లిపాలే మొదటి వ్యాధి నిరోధక టీకా



సదస్సులో మాట్లాడుతున్న యుగంధర్

చంద్రగిరి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): తల్లిపాలే మొదటి వ్యాధి నిరోధక టీకా అని చంద్రగిరి ఆర్‌హెచ్‌ఎస్ హెల్త్ ఆఫీసర్ యుగంధర్ అన్నారు. శుక్రవారం తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా ఎస్వీ మెడికల్ కాలేజీ కమ్యూనిటీ మెడిసిన్, హెచ్‌వోడీ సునీత అధ్యక్షతన, యుగంధర్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు ర్యాలీ నిర్వహించారు. ప్రసవం అయిన గంటలోపే బిడ్డకు తల్లి ముర్రుపాలు తాగించాలని, ఇది వ్యాధి నిరోధక టీకాగా పనిచేస్తుందని అన్నారు. తద్వారా వ్యాధి నిరోధక శక్తి పెరిగి మరణాల రేటు తగ్గుతుందని పేర్కొన్నారు. పిల్లలు ఆరోగ్యంగా ఆదర్శవంతంగా సమాజాభివృద్ధికి తోడ్పడే విధంగా ఎదుగుతారని తెలిపారు, తల్లిపాల విషయంలో అపోహలు విడనాడాలన్నారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ మెడిసిన్ డిపార్ట్‌మెంట్ అసోసియేట్ ప్రొఫెసర్ దయాకర్, డాక్టర్లు కృష్ణకుమారి, హేమచంద్ర, శశికళ, శ్రీధర్, మధుసూదనరావు, సౌమ్యప్రియ, రేవతి, పీజీ డాక్టర్లు మోహన్, రాహుల్ సందీప్, మేఘ, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ ఎం.టాటాబాయి సూపర్‌వైజర్లు ప్రమీల, నారాయణరాజు, తులసీరామ్, ఏఎన్‌ఎంలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, విద్యార్థులు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

బంగారు తిరుచ్చిపై సిరుల తల్లి



మాడవీధుల్లో ఊరేగుతున్న పద్మావతి అమ్మవారు

తిరుచానూరు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పద్మావతి అమ్మవారు శుక్రవారం బంగారు తిరుచ్చిపై కొలువుదీరి తిరుమాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు సాక్షాత్కరించారు. ఉదయం సుప్రభాత సేవతో అమ్మవారిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు నిర్వహించారు. మూలమూర్తికి నేత్రపర్వంగా అభిషేకం చేశారు. మధ్యాహ్నం ఉత్సవమూర్తికి అర్చకులు స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం అలంకార శోభితురాలైన అమ్మవారికి అత్యంత వేడుకగా తిరువీధి ఉత్సవం చేపట్టారు. శ్రావణ మాసం రెండవ శుక్రవారం కావడంతో అమ్మవారి దర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వీఐపీ బ్రేక్, కుంకుమార్చన రద్దు చేసినట్లు ఆలయాధికారుల తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో హరీందర్‌నాథ్, ఏవీఎస్వో రాధాకృష్ణమూర్తి, అర్చకులు బాబుస్వామి, సూపరింటెండెంట్ రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు చలపతి, సుభాస్కర్‌నాయుడు, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

ఎల్లమ్మకు పొంగళ్లు



పొంగళ్లు తీసుకొస్తున్న రెడ్డివారిపల్లె గ్రామస్తులు

చంద్రగిరి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డివారిపల్లె గ్రామస్తులు శుక్రవారం చంద్రగిరి మూలస్థాన ఎల్లమ్మకు పొంగళ్లు పెట్టారు. ఉదయం గ్రామస్తులు పొంగళ్లు తీసుకుని కాలినడకన మూలస్థాన ఎల్లమ్మ ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారికి నైవేద్యంపెట్టి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఉత్సవ కమిటీ ఛైర్మన్ మొక్కల చంద్రశేఖర్‌రెడ్డి రెడ్డివారిపల్లె గ్రామస్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ ఈవో మమత పాల్గొన్నారు.

వైభవంగా మాతమ్మ కొలుపు



ఆలయానికి రూ.50వేలు విరాళాన్ని అందిస్తున్న శివాయాదవ్

తిరుపతి రూరల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం చిగురువాడ పంచాయతీ కొత్తూరు హరిజనవాడలో వెలసిన మాతమ్మ కొలుపు ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం తపస్సు కార్యక్రమాన్ని గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. గ్రామానికి చెందిన టీడీపీ నేత వార్తాల శివయాదవ్ కుటుంబ సభ్యులతో కలసి అమ్మవారికి సంప్రదాయంగా పట్టువస్త్రాలను సమర్పించి, మొక్కు తీర్చుకున్నారు. ఆలయ అభివృద్ధికి రూ.50వేల నగదును విరాళంగా అందించారు. మాజీ ఎంపీటీసీ వార్తాల శ్రీనివాసులుయాదవ్, టీడీపీ నేతలు వెంకట్రామయ్య, మల్లీశ్వర్‌రెడ్డి, నాగరాజుయాదవ్, మునస్వామి, భాస్కర్‌యాదవ్, నరేంద్ర, బాల, రఫీ, రుద్రయ్య, బాబి, హనుమాన్‌నాయక్, జయరామయ్య తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణి డ్యామ్ సమీపంలో గజరాజుల బీభత్సం

చంద్రగిరి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలంలో గత నాలుగు రోజులుగా గజరాజులు శేషాచలం అటవీ ప్రాంత సరిహద్దులలో స్వైర విహారం చేస్తున్నాయి. గురువారం ఎ.రంగంపేట పంచాయతీ పరిధిలోని కళ్యాణీ డ్యామ్ సమీపంలో ఎ.రంగంపేటకు ఉమాపతిరెడ్డికి చెందిన మామిడి తోటలో ఏనుగులు చొరబడి ధ్వంసం చేసాయి. గురువారం రాత్రి 9 గంటల సమయంలో డ్యామ్ మీదుగా వచ్చి మామిడి చెట్లను ధ్వంసం చేసి శుక్రవారం ఉదయం 5.30 గంటల సమయంలో మళ్లీ శేషాచలం అడవుల్లోకి ఏనుగులు వెళ్లాయి. అటవీ ప్రాంత సమీపంలో ఉన్న ప్రజలను అటవీ అధికారులు అప్రతమ్తం చేస్తున్నారు. ఏనుగుల గుంపు కళ్యాణీ డ్యామ్ ప్రాంతంలో సంచరిస్తున్నాయని అటవీ సిబ్బంది గుర్తించడంతో రాగిమాకులకుంట, దుర్గం ఎస్టీ కాలనీల వైపు రాకుండా అటవీ సిబ్బంది బాణసంచా కాల్చి, డప్పులు వాయించారు. నాగపట్ల రేంజ్ ఫారెస్ట్ అధికారులు మండలంలోని శ్రీనివాస మంగాపురం ఎస్టీ కాలనీ, నరసింగాపురం పంచాయతీలోని సత్యసాయిఎస్టీ కాలనీ, రామిరెడ్డిపల్లె పంచాయతీలోని వైకుంఠపురం ఎస్టీ కాలనీ, ఎ.రంగంపేట పంచాయతీలోని ఎంబీయూ విద్యాసంస్థ ప్రాంతం, రాగిమాకుల ఎస్టీ కాలనీ, దుర్గం ఎస్టీకాలనీలలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్నారు. అదేవిధంగా రాత్రి వేళల్లో రైతులు తమ పొలాల వద్దకు వెళ్లకూడదని సూచించారు. ఏనుగుల సంచారం తెలిస్తే తమకు వెంటనే వాట్సాప్ గ్రూప్ ద్వారా సమాచారం అందించాలని తెలిపారు.

ఫెర్టిలిటీ సెంటర్లలో తనిఖీలు



ఫెర్టిలిటీ సెంటర్‌లో రికార్డులు పరిశీలిస్తున్న డీఐవో శాంతకుమారి

తిరుపతి (వైద్యం), ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని మాతృత్వ, అంకుర ఫెర్టిలిటీ సెంటర్లలో డీఐవో శాంతకుమారి శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. రికార్డులను, వైద్య పరికరాలను పరిశీలించారు. నిబంధనలకు లోబడి ఫెర్టిలిటీ సెంటర్లు నిర్వహించాలని ఏఆర్‌టీ చట్టాన్ని ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వైద్యాధికారులు త్రివేణి, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తుమ్మలగుంటలో సామాజిక తనిఖీ గ్రామసభ



గ్రామసభలో సర్పంచ్ సుబ్బరామిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి తదితరులు - ఫింఛన్లు పంపిణీ చేస్తున్న సిబ్బంది, పక్కన టీడీపీనేతలు

తిరుపతిరూరల్, ఆగస్టు1(ఆంధ్రజ్యోతి): తుమ్మలగుంట గ్రామంలో సర్పంచ్ సుబ్బరామిరెడ్డి అధ్యక్షతన శుక్రవారం సామాజిక తనిఖీ గ్రామసభ నిర్వహించారు. గ్రామంలో వేజ్, మెటీరియల్ కాంపోనెంట్ నిధులతో చేపట్టిన పనులపై సామాజిక తనిఖీ సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి పి.వెంకటేశ్వర్లు, ఉపసర్పంచ్ గోపాల్‌రెడ్డి, ఎంపీటీసీ బుజ్జమ్మ, టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బిరుదాల భాస్కర్‌రెడ్డి, కేశవులుశెట్టి, గ్రామస్తులు పాల్గొన్నారు. కాగా, తుమ్మలగుంట గ్రామంలో శుక్రవారం సామాజిక పింఛన్లను పంపిణీ చేశారు. స్పౌజ్ కేటగిరీలో గ్రామంలో కొత్తగా 9మందికి ప్రభుత్వం పింఛన్లు మంజూరు చేసిందని కార్యదర్శి పి.వెంకటేశ్వర్లు తెలిపారు. టీడీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు పార్లపల్లి భరత్‌కుమార్‌రెడ్డి, నాయకులు బిరుదాల భాస్కర్‌రెడ్డి, బిరుదాల సిద్ధారెడ్డి, రాధాకృష్ణ, సరస్వతి, జయచంద్రారెడ్డి, వెంకటేష్‌నాయుడు, గురవారెడ్డి పాల్గొన్నారు.

'ఎర్ర' స్మగ్లర్ అరెస్టు



మంగళం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): పుత్తూరు రేంజ్ పాలమంగళం అటవీప్రాంతంలో టాస్క్‌ఫోర్సు పోలీసులు కూంబింగ్ నిర్వహించి ఒకస్మగ్లర్‌ను అరెస్టు చేసి అతడి నుంచి పిడిలేని గొడ్డలిని స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్సు హెడ్ సుబ్బరాయుడు ఆదేశాలమేరకు ఎస్పీశ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆర్‌ఐ సాయి గిరిధర్, ఏఆర్‌ఎస్‌ఐ ఈశ్వరరెడ్డి, స్థానిక ఎఫ్‌బీవో కస్తూరిబాయితో కలిసి గురువారం రాత్రి పాలమంగళం అటవీసెక్షన్‌లో కూంబింగ్ నిర్వహించారు. కొందరు వ్యక్తులు అరణ్యకండ్రిగ అటవీప్రాంతంలోకి వెళుతూ టాస్క్‌ఫోర్సుపోలీసు కంటపడ్డారు. వీరిని చుట్టుముట్టేప్రయత్నం చేయగా వారు అడవుల్లోకి పారిపోయారు. అయితే టాస్క్‌ఫోర్సు పోలీసులు ఒకరిని పట్టుకోగలిగారు. అతని నుంచి పిడిలేని గొడ్డలిని స్వాధీనం చేసుకున్నారు. అతడిని తమిళనాడుకు చెందినవ్యక్తిగా గుర్తించారు. పారిపోయిన వారి కోసం గాలిస్తున్నారు. పట్టుబడ్డస్మగ్లర్‌ను తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్‌స్టేషన్‌కు తరలించిహెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోగులకు చక్కటి వైద్యసేవలు అందించాలి

ఎస్వీ వైద్య కళాశాల పీజీ ఫెస్ట్‌లో కలెక్టర్ వెంకటేశ్వర్



క్రీడల్లో ప్రతిభ కనబరిచిన వారికి జ్ఞాపికలు అందజేస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(వైద్యం), ఆగస్టు1(ఆంధ్రజ్యోతి): వైద్య వృత్తిలో పనిచేసే వారు రోగులకు మెరుగైనసేవలు అందించడమేగాక కుటుంబ జీవితానికి కూడా ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. ఎస్వీ వైద్య కళాశాలలో శుక్రవారం రాత్రి నిర్వహించిన పీజీ ఫెస్ట్(నెక్సాస్25)కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పీజీ వైద్య విద్యార్థులు వృత్తిని, కుటుంబాన్ని బ్యాలెన్స్ చేసుకుంటూ ముందుకు సాగాలన్నారు. సివిల్ సర్వీసెస్ మీద ఆసక్తి ఉంటే ఆ మార్గంలోనూ మంచి భవిష్యత్తును ఎన్నుకోవచ్చన్నారు.అనంతరం క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వైద్య విద్యార్థులకు జ్ఞాపికలు అందజేశారు. అనంతరం కలెక్టర్‌ను వైద్య విద్యార్థులు సన్మానించారు. హస్తకళ అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, కళాశాల ప్రిన్సిపాల్ రవిప్రభు, రుయా మాజీ సూపరింటెండెంట్ భారతి పాల్గొన్నారు.

గౌహతిలో శ్రీవారి ఆలయం

ఐదెకరాలు కేటాయించిన అసోం ప్రభుత్వం



గౌహతిలో స్థలం కేటాయించాలంటూ అస్సాం సీఎంకు వినతిపత్రం ఇస్తున్న టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు

తిరుమల, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): గౌహతిలో శ్రీవారి ఆలయ నిర్మాణం కోసం ఐదెకరాల స్థలాన్ని అస్సాం రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు శుక్రవారం ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి హిమంత బిస్వా శర్మను కలిశారు. అన్ని రాష్ట్రాల ప్రధాన నగరాల్లో శ్రీవారి ఆలయాలు నిర్మించాలని ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు సూచనను ఆయన అస్సాం ముఖ్యమంత్రికి వివరించారు. దీంతో గౌహతిలో స్థలం కేటాయించడంతోపాటూ ఆలయ నిర్మాణానికి అన్ని రకాలుగా సహాయసహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. గౌహతిలో స్థలం కేటాయింపు అంశంలో అఖిల భారత హిందూ మహాసభ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ జీవీఆర్ శాస్త్రి ముఖ్యపాత్ర పోషించారు.

మీడియా ప్రతినిధులకు ప్రెస్ స్టిక్కర్లు



ప్రెస్ స్టిక్కర్ అంటిస్తున్న ఎస్పీ హర్షవర్ధనరాజు

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు1(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం తిరుపతిలో ఎస్పీ హర్షవర్ధనరాజు మీడియా ప్రతినిధులకు క్యూఆర్ కోడ్‌తో కూడిన ప్రెస్ స్టిక్కర్లను పంపిణీ చేశారు. ఎస్పీ మాట్లాడుతూ మీడియాలో పనిచేయని వారు సైతం ప్రెస్ స్టిక్కర్లు వేసుకుని చెలామణి అవుతున్నారని, తద్వారా అసలైన జర్నలిస్టులను గుర్తుపట్టడం కష్టమవుతోందని తెలిపారు. అందుకే ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు క్యూఆర్ కోడ్‌తో కలిగిన ప్రెస్ స్టిక్కర్లు ఏర్పాటు చేశామన్నారు. నకిలీ ప్రెస్ స్టిక్కర్లు వేసుకుని తిరిగితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా పోలీసు శాఖకు ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు మురళి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ డీఎస్పీ రామకృష్ణమాచారి, సీఐలు, ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు బాలచంద్ర, లావణ్య, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, ఎస్పీ పీఆర్‌ఓలు నాగరాజు, తిరుమలరావు పాల్గొన్నారు.

డ్రగ్స్ అనర్థాలపై అవగాహన



డీసీ విజయశేఖర్

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ వాడకం వల్ల కలిగే అనర్థాలపై శుక్రవారం రూరల్ పరిధిలోని గొల్లపల్లి సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఉమ్మడి జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ విజయశేఖర్ మాట్లాడుతూ గంజాయి, ఇతర మత్తు పదార్థాల వల్ల ఆరోగ్యం క్షీణించడమేగాక ఆయుష్షు తగ్గిపోతోందన్నారు. ఒక్కోసారి క్యాన్సర్ బారినపడే ప్రమాదముందని హెచ్చరించారు. ఎక్సైజ్ ఈఎస్ నాగమల్లేశ్వరరెడ్డి, అదనపు ఈఎస్ వాసుదేవ చౌదరి, ఏపీఎస్‌బీసీఎల్ డీఎం జానకిరాం, తిరుపతి రూరల్ ఎక్సైజ్ సీఐ నరసానాయుడు, డీటీఎఫ్ సీఐ శ్యాం ప్రసాద్, ఎస్ఐ కవీశ్వర నాయుడు పాల్గొన్నారు.

సెప్టెంబరు 9న సప్తమోక్ష క్షేత్ర రైలుయాత్ర

తిరుపతి(జీవకోన), ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): పవిత్ర పుణ్యక్షేత్ర దర్శనాలే లక్ష్యంగా ఆధ్యాత్మిక యాత్రకు శ్రీకారం చుట్టినట్లు ఇండియన్ రైల్వే సౌత్‌స్టార్ రైల్ అండ్ టూర్ టైమ్స్ డైరెక్టర్ విఘ్నేష్ తెలిపారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ ఈ యాత్ర సెప్టెంబరు 9న ప్రారంభమవుతుందని, గూడూరు, నెల్లూరు, ఒంగోలు, చీరాల, గుంటూరు, మిర్యాలగూడ, నల్గొండ, హైదరాబాద్, కాజీపేట స్టేషన్లలో రైలు ఎక్కే వీలుందని పేర్కొన్నారు. 15 రోజులపాటు నిర్వహించనున్న ఈ యాత్రను 'టూర్ టైమ్స్' సంస్థ నిర్వహిస్తోందని తెలిపారు. టూర్‌టైమ్స్ జనరల్ మేనేజర్ సంతోష్ మాట్లాడుతూ ఈ యాత్రలో అయోధ్య, మధుర, కాశీ, ఉజ్జయిని, ద్వారకా, గయ, మాతృగయ తదితర క్షేత్రాలు ఉన్నాయని తెలిపారు. దక్షిణ భారత భోజనం అందుబాటులో ఉంటుందన్నారు. థర్డ్ ఏసీ(కంఫర్ట్) రూ.45,750, సెకండ్ ఏసీ (డీలక్స్) రూ.54,100, ఫస్ట్ ఏసీ (లగ్జరీ) రూ.69,500గా ధర నిర్ణయించినట్లు వెల్లడించారు. 9355021516కు ఫోన్ చేసి టికెట్ బుక్ చేసుకోవచ్చన్నారు.

నిరాశ్రయులకు వసతులు కల్పించాలి

తిరుపతి, ఆగస్టు1(ఆంధ్రజ్యోతి) : నిరాశ్రయులకు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలని కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. శుక్రవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో షెల్టర్ ఫర్ అర్బన్ హోమ్ లెస్ కౌన్సిల్ కమిటీ మీటింగ్‌ను కమిషనర్ నిర్వహించారు. పట్నూల్ వీధిలో షెల్టర్‌ను హోప్ ఫౌండేషన్ వారు నిర్వహిస్తున్నారు. వారి ఒప్పందకాలం ముగియడంతో స్వచ్ఛందంగా తప్పుకున్నారు. ఈ షెల్టర్ నిర్వహణ బాధ్యతను అమ్మ ఫౌండేషన్ వారు తీసుకునేందుకు ముందుకు రావడంతో వారికి అప్పగించేందుకు సభ్యులు ఏకగ్రీవంగా నిర్ణయించామని కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమములో కమిటీ సభ్యులు డీసీపీ ఖాన్, హెల్త్ ఆఫీసర్ యువ అన్వేష్, సీఎంఎంలు కృష్ణవేణి, సోమకుమార్ పాల్గొన్నారు.

మలేషియా వర్సిటీతో పద్మావతి కాలేజీ ఒప్పందం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మలేషియాలోని తెరంగాను యూనివర్సిటీతో పద్మావతి డిగ్రీ కాలేజీ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. మలేషియా యూనివర్సిటీ ప్రతినిధి డాక్టర్ షేక్ మున్నూర్ ఇస్మాయిల్ శుక్రవారం పద్మావతి కాలేజీలో పర్యటించారు. ప్రిన్సిపాల్ నారాయణమ్మతో సమావేశ మయ్యారు. ఒప్పందంపై చర్చించారు. ఒప్పంద పత్రాలపై ఇరువురూ సంతకాలు చేశారు. బోధన, పరిశోధన, విస్తరణ కార్యక్రమాల్లో పరస్పరం సహకరించుకోనున్నట్లు వారు వెల్లడించారు.

పద్మావతి వర్సిటీలో ఆప్కో చేనేత వస్త్ర ప్రదర్శన



ప్రదర్శనను ప్రారంభించి వస్త్రాలను పరిశీలిస్తున్న వీసీ ఉమ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): శ్రీపద్మావతి మహిళా యూనివర్సిటీలో ఆప్కో చేనేత వస్త్ర ప్రదర్శన చేపట్టింది. ఇందిరా ప్రియదర్శినీ ఆడిటోరియంలో ఈ ప్రదర్శనను వీసీ ఉమ ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ఈనెల 7వ తేదీన చేనేత దినోత్సవం సందర్భంగా వస్త్ర ప్రదర్శనకు సహకరిస్తున్నట్టు తెలిపారు. రిజిస్ట్రార్ రజని మాట్లాడుతూ విద్యార్థులు, ఉద్యోగులు ఈ ప్రదర్శనను వీక్షించి, చేనేతను ప్రోత్సహించాలని సూచించారు. చేనేత వస్త్రాలు మన సంస్కృతీ, సంప్రదాయాలకు ప్రతీక అని, అందరూ చేనేత వస్త్రాలను ధరించాలని విజ్ఞప్తి చేశారు. కాగా, ఈనెల 7వ తేదీ వరకు ఈ ప్రదర్శన కొనసాగనుంది. జౌళి శాఖ ఏడీ రాచపూటి రమేష్, ఆప్కో మండల వాణిజ్య అధికారి కోటేశ్వరరావు మాట్లాడుతూ 30 నుంచీ 50 శాతం రాయితీ ఇస్తున్నట్టు తెలిపారు.

అమర గాయకుడు ఘంటసాల



ఘంటసాలకు నివాళి అర్పిస్తున్న గోపినాథరెడ్డి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఘంటసాల వెంకటేశ్వరరావు అమర గాయకుడని రాయలసీమ రంగస్థలి అధ్యక్షుడు గుండాల గోపినాథరెడ్డి పేర్కొన్నారు. రాయలసీమ రంగస్థలి వారు ప్రతినెలా ఒకటో తేదీ భవానీనగర్ సమీపంలో గల ఘంటసాల విగ్రహానికి పుష్పాంజలి ఘటించడం ఆనవాయితీగా పెట్టుకున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం విగ్రహానికి నివాళి అర్పించి, ఘంటసాల అభిమాని పోకల జనార్దన్‌ను సత్కరించారు.

డిగ్రీ, పీజీ అడ్మిషన్లు నిర్వహించండి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో డిగ్రీ, పీజీ అడ్మిషన్లు చేపట్టాలని అఖిల భారత శిక్షక్ మహాసంఘ్ (ఏబీఆర్‌ఎస్‌ఎం) రాష్ట్ర అధ్యక్షుడు వైవీ రామిరెడ్డి కోరారు. ఈ ఆలస్యంతో అడ్మిషన్ల సంఖ్య తగ్గే అవకాశముందని పేర్కొన్నారు. విద్యార్థులు ఇతర రాష్ట్రాల్లోని ప్రైవేట్ కాలేజీల్లో చేరే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రవేశాలు వెంటనే చేపట్టాలని ప్రభుత్వానికి ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

బయోవ్యర్థాలను ప్రత్యేకంగా సేకరించాలి



తిరుపతి(వైద్యం), ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): బయోవ్యర్థాల విషయంలో జాగ్రత్తగా ఉండాలని, వాటిని ప్రత్యేకంగా సేకరించి భద్రపరచాలని ఏఆర్ఎంవో హరికృష్ణ సిబ్బందికి సూచించారు. రుయాస్పత్రిలోని స్టాఫ్ నర్సులకు శుక్రవారం బయో వ్యర్థాలపై ఆయన అవగాహన కల్పించారు. రోగులకు శస్త్ర చికిత్స అనంతరం తొలగించిన శరీర అవయవాలను, పరికరాలను సేకరించి దూర ప్రాంతాల్లో భద్రపరచాలన్నారు. ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

బాలాత్రిపురసుందరిగా అన్నపూర్ణాదేవి



తిరుపతి అర్బన్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం రెండవ శుక్రవారాన్ని పురస్కరించుకుని లక్ష్మీపురం కూడలిలోని అన్నపూర్ణదేవి సమేత కాశీవిశ్వనాథస్వామి ఆలయంలో కొలువైన అమ్మవారు బాలాత్రిపుర సుందరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అంతకు ముందు నైవేద్యం సమర్పించి, శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. సాయంత్రం భక్తులు ఆలయాన్ని సందర్శించి, ప్రసాదాలు స్వీకరించారు.

మఠం భవనంపై ఆమోదయోగ్యమైన నిర్ణయం

● నగర పాలక సంస్థ కమిషనర్ మౌర్య



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ మౌర్య

తిరుపతి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని గాంధీ రోడ్డులో గల హథీరాంజీ మఠంలో దుకాణాలు నిర్వహిస్తున్న ఎవ్వరికీ ఇబ్బంది కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అన్నారు. పురాతనమైన హథీరాంజీ భవనం కూల్చడంపై శుక్రవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, దుకాణదారులతో కమిషనర్ సమావేశమై వారి అభిప్రాయాన్ని సేకరించారు. ఎక్కడైతే కూలిపోయే పరిస్థితి ఉందో అక్కడ మరమ్మతులు చేయించాలని కోరారు. కమిషనర్ మాట్లాడుతూ తిరుపతి ఐఐటీ నిపుణుల నివేదిక మేరకు గాంధీ రోడ్డు వైపు నార్త్ వెస్ట్ కార్నర్లు పడగొట్టి పునర్నిర్మాణం చేయాల్సి ఉందన్నారు. కూల్చివేసిన ప్రాంతంలో ఎవరి షాపులు వారికి కేటాయించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో ఏపీజీబీసీ ఛైర్మన్ సుగుణమ్మ, యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, అర్బన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వూకా విజయకుమార్, కార్పొరేటర్లు ఎస్కే బాబు, నరసింహ ఆచారి, నరేంద్ర, అనిల్, మఠం ఏడీ బాపిరెడ్డి, ఆర్డీవో రామ్మోహన్, తహసీల్దార్ సురేంద్రబాబు, రెవెన్యూ ఆఫీసర్ సేతుమాధవ్, డీసీపీ ఖాన్, సర్వేయర్లు కోటేశ్వరరావు, రమేష్ పాల్గొన్నారు.

హామీలన్నీ దశలవారీగా నెరవేరుస్తున్నాం

● పింఛన్ల పంపిణీలో ఎమ్మెల్యే శ్రీనివాసులు



వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే ఆరణి

తిరుపతి, ఆగస్టు1(ఆంధ్రజ్యోతి) : ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నట్లు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. రెండో డివిజన్ పరిధిలో ఆయన కూటమి నేతలతో కలిసి శుక్రవారం పెన్షన్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ స్పౌజ్(జీవిత భాగస్వామి) పెన్షన్‌లను ఐదేళ్ల తర్వాత పునరుద్ధరించినట్లు చెప్పారు. శనివారం అన్నదాత సుఖీభవ పథకం నిధులను రైతుల ఖాతాలో జమ చేయనున్నట్లు చెప్పారు. 15వ తేదీ నుంచి ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. ఉచిత సిలిండర్లు, తల్లికి వందనం హామీలను అమలు చేసిన విషయం గుర్తు చేశారు. పెన్షన్‌ను రూ.రెండువేల నుంచి మూడు వేలకు పెంచడానికి ఐదేళ్లు తీసుకున్న వైసీపీ నేతలకు తమ ప్రభుత్వాన్ని విమర్శించే అర్హత లేదన్నారు. ఈ కార్యక్రమంలో యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ రుద్రకోటి సదాశివం, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, కార్పొరేషన్ ఇన్‌చార్జి డిప్యూటీ కమిషనర్ సేతుమాధవ్, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కుమారమ్మ, కూటమి నాయకులు శ్రీధర్‌వర్మ, రాజారెడ్డి, బాలిశెట్టి కిషోర్, చల్లా, బాబ్జీ, పెంచలయ్య, నాని, భరత్, శంకర్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

285 మందికి జీవిత భాగస్వామి పెన్షన్లు





పెన్షన్లు పంపిణీ చేస్తున్న మునికృష్ణ, మహేష్ యాదవ్ - మంగళంలో పింఛన్లు అందచేస్తున్న టీడీపీ నేతలు

తిరుపతి, ఆగస్టు1(ఆంధ్రజ్యోతి) : తిరుపతిలో 285 మందికి జీవిత భాగస్వామ్య (స్పౌజ్) పెన్షన్లు ఐదేళ్ల తర్వాత కూటమి ప్రభుత్వం అందిస్తోందని టీడీపీ నాయకులు అన్నారు. 42వ డివిజన్ సూరయ్యకట్ట, ప్రశాంతినగర్, శాంతినగర్‌లో శుక్రవారం ఇంటింటికీ వెళ్లి పెన్షన్ పంపిణీ చేశారు. డిప్యూటీ మేయర్, క్లస్టర్ ఇన్‌చార్జ్ ఆర్సీ మునికృష్ణ, యూనిట్ ఇన్‌చార్జ్ మహేష్ యాదవ్, 42, 35 డివిజన్ల అధ్యక్షులు కె.రూపేష్, ఎస్వీఎం శ్రీధర్, జగ్గా, మునిలక్ష్మి, అరుణ్, వెంకటేష్, మునస్వామి, చంద్రారెడ్డి పాల్గొన్నారు.

మంగళం పరిధిలో..

తిరుపతి అర్బన్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): మంగళం పరిధిలోని సప్తగిరికాలనీ పంచాయతీలో 8, రణధీరపురం 12, మంగళం క్వార్టర్స్ 11, శెట్టిపల్లె 13, తిరుమలనగర్ 17 మందికి రూ.4వేల చొప్పున జీవిత భాగస్వామ్య (స్పౌజ్) పెన్షన్లు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు ఎస్.ఈ.గోవిందరాజులు, గోపినాథ్, చంద్ర, అజీజ్ బాషా, జనార్దన్, రాధాకృష్ణ, ఢిల్లీబాబు, దాము, జయశంకర్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

బిడ్డకు తల్లిపాలకు మించిన ఔషధం లేదు



ర్యాలీని ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ రవిప్రభు

తిరుపతి(వైద్యం), ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): పుట్టిన బిడ్డలకు తల్లిపాలకు మించిన ఔషధం మరొకటి లేదనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలని ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ రవిప్రభు అన్నారు. రుయా చిన్నపిల్లల విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన తల్లిపాల అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పురిటి బిడ్డలకు తల్లిపాలు పట్టించడం ద్వారా వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలను తప్పక పట్టించాలని సూచించారు. అనంతరం ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. రుయాస్పత్రి నుంచి ఎస్వీ వైద్య కళాశాల సర్కిల్ వరకు ర్యాలీ కొనసాగింది. రుయా, ప్రసూతి ఆస్పత్రుల సూపరింటెండెంట్లు రాధ, ప్రమీలదేవి, చిన్నపిల్లల విభాగాధిపతి మనోహర్, వైద్యాధికారులు నిర్మలాదేవి, కిరీటి పాల్గొన్నారు.

● ఈఎస్ఐ ఆస్పత్రిలో మెడికల్ సూపరింటెండెంట్ శ్యాంబాబు ఆధ్వర్యంలో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఆస్పత్రిలోని సిబ్బందికి, రోగులకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు.

ఎస్ఏలను ఎంఈవో-1లుగా నియమించడం సరికాదు



నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

తిరుపతి(విద్య), ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): మండల విద్యాశాఖాధికారి 1 పోస్టులను స్కూల్ అసిస్టెంట్ టీచర్లతో భర్తీ చేయడం సరికాదని ఉపాధ్యాయ సంఘాల నేతలు పేర్కొన్నారు. ఆపస్, పీఆర్‌టీయూ నిరసన కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం తిరుపతి రూరల్ మండలం మంగళం ట్రెండ్స్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ మాట్లాడుతూ ఉమ్మడి సీనియారిటీ ప్రకారం ఎంఈఓ-1లను నియమించాల్సి ఉండగా అందుకు విరుద్ధంగా ప్రభుత్వ పాఠశాలల స్కూల్ అసిస్టెంట్లతో భర్తీ చేయడం అన్యాయమన్నారు. ఏకీకృత సర్వీస్ రూల్స్‌కు సంబంధించిన కేసు కోర్టులో పెండింగ్‌లో ఉండగా ఇలాంటి చర్యలు చేపట్టడం సరికాదని, ఈ చర్యలను ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబిరెడ్డి, రాష్ట్ర బాధ్యులు సుభాష్ చంద్రదాస్, పాఠశాల హెచ్ఎం కేశవులునాయుడు పాల్గొన్నారు.

శ్రావణమాసం విశిష్టమైంది

– బ్యాంక్ చీఫ్ మేనేజరు ప్రసాద్



దుప్పట్లు పంపిణీ చేస్తున్న రాస్ డైరెక్టర్ నాగరాజు

తిరుపతి(ఆటోనగర్), ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): మహిళలు పూజలు, వ్రతాలు, నోములు చేసుకోవడానికి శ్రావణ మాసం విశిష్టమైందని, ఈ మాసంలో అష్టలక్ష్ములను కొలిస్తే శుభం కలుగుతుందని యూనియన్ బ్యాంక్ చీఫ్ మేనేజరు ఎస్.ప్రసాద్ అన్నారు. కెనడీనగర్‌లోని అంకాళమ్మ ఆలయంలో శుక్రవారం రాష్ట్రీయ సేవా సమితి (రాస్) ఆధ్వర్యంలో వరలక్ష్మీవ్రతం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రసాద్ మాట్లాడుతూ శ్రావణ మాసంలో ఉపవాసాలతో పరమేశ్వరుడిని బిల్వ పత్రాలతో పూజిస్తే సమస్త దోషాలు తొలుగుతాయన్నారు. రాస్ డైరెక్టర్ వి.నాగరాజు మాట్లాడుతూ ఈ మాసంలో మహిళలు లక్ష్మీదేవిని పూజిస్తే సకల శుభాలు కలుగుతాయని తెలిపారు. అనంతరం వృద్ధులకు చేతికర్రలు, దుప్పట్లు పంపిణీ చేశారు. పూజల్లో సత్యనారాయణ, చంద్రకళ, వాణి, భార్గవి, కవిత పాల్గొన్నారు.

కేంద్రమంత్రి గడ్కరీకి ఘన స్వాగతం



గడ్కరీకి స్వాగతం పలుకుతున్న మంత్రి, కలెక్టర్, శ్రీకాళహస్తి, తిరుపతి ఎమ్మెల్యేలు, బీజేపీ నాయకులు

రేణిగుంట ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): కేంద్ర రోడ్డు, జాతీయ రహదారుల మంత్రి నితిన్ గడ్కరీకి తిరుపతి విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. శ్రీవారి దర్శనార్థం కేంద్ర మంత్రి కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం రాత్రి పూణే నుంచి ప్రత్యేక విమానంలో తిరుపతి విమానాశ్రయం చేరుకున్నారు. ఆయనకు మంత్రి జనార్దన్ రెడ్డి, కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, శ్రీకాళహస్తి, తిరుపతి ఎమ్మెల్యేలు బొజ్జల సుధీర్ రెడ్డి, ఆరణి శ్రీనివాసులు, జాయింట్ కలెక్టర్ శుభం బన్సాల్, టీటీడీ బోర్డు మెంబర్ భానుప్రకాష్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ తదితరులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన రోడ్డు మార్గాన తిరుమలకు బయలుదేరి వెళ్లారు. అక్కడ రాత్రి బస చేసి శనివారం ఉదయం శ్రీవారిని దర్శించుకున్న అనంతరం రోడ్డు మార్గన తిరుచానూరుకు చేరుకొని అమ్మవారిని దర్శించుకుంటారు. అక్కడినుంచి కంచి కామకోటి పీఠం చేరుకొని అక్కడ జరిగే పూజా కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం మధ్యాహ్నం తిరుపతి విమానాశ్రయం చేరుకొని ప్రత్యేక విమానంలో విజయవాడకు బయలుదేరి వెళ్లనున్నారు.

కేంద్ర మంత్రికి వినతి : శ్రీకాళహస్తి ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి నియోజకవర్గ అభివృద్ధి పనులపై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి వినతిపత్రం అందజేశారు. గుడిమల్లం ఆలయ విశిష్టను కేంద్రమంత్రికి వివరించారు. ఆలయ చరిత్రకు సంబంధించిన పుస్తకాన్ని అందజేశారు.

ఈ పంచాయతీ కార్యదర్శి మాకొద్దు

● డీపీవోకు సాయినగర్ సర్పంచ్ ఫిర్యాదు

తిరుచానూరు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం సాయినగర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి బాలాజీ నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తున్నారని, ఆయన తమకు వద్దని సర్పంచ్ డీపీ రమణ శుక్రవారం కలెక్టరేట్‌లో డీపీవో సుశీలాదేవికి రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. గ్రామ పంచాయతీ ఖాతాలో నగదు ఉన్నా రెండు నెలలుగా పంచాయతీ సిబ్బందికి జీతాలు ఇవ్వకుండా వేధిస్తున్నాడని. పంచాయతీ నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని పేర్కొన్నారు. అడ్డదిడ్డంగా ఇంటి పన్నులు వేయాలని సిబ్బందిపై ఒత్తిడి తెస్తున్నాడని తెలిపారు. గతంలోనూ ఆయనపై పలు ఆరోపణలు ఉన్నాయని, విచారించాలని కోరారు.

విదేశీ విద్యపై విద్యార్థులకు అవగాహన

తిరుపతి(విద్య), ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ఐఎంఎస్ స్టడి అబ్రాడ్ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు విదేశీ విద్యపై ఉచిత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక హోటల్లో జరిగిన సదస్సుకు నగర, చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన విద్యార్థులు హాజరయ్యారు. అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, యూకే దేశాలలో ఉన్న ప్రముఖ విశ్వవిద్యాలయాల ప్రతినిధులు పాల్గొని విద్యావిధానం, ప్రవేశప్రక్రియ, స్కాలర్‌షిప్, వీసా అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఐఎంఎస్ సంస్థ ప్రతినిధులు సాయి, శ్రీనివాస్, మెడిశెట్టి పరివేందర్ పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడికి ఆత్మీయ సత్కారం

తిరుపతి(ఉపాధ్యాయనగర్), ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లకుప్పం శేఖర్‌కు శుక్రవారం వడ్డెర సంఘం ఆధ్వర్యంలో ఆత్మీయ సన్మానం చేశారు. నగరంలోని ఓ హోటల్లో జరిగిన ఈ కార్యక్రమానికి ఎస్సీ మోర్చా తమిళనాడు రాష్ట్ర ఇన్‌చార్జి డాక్టర్ వెంకటేశ్ మౌర్య ముఖ్య అతిథిగా హాజరై శేఖర్‌ను సన్మానించారు. ఆయన మాట్లాడుతూ శేఖర్ పార్టీకి ఎంతో సేవ చేశారని, అది గుర్తించిన పార్టీ ఆయనకు ఉన్నత స్థానాన్ని కట్టబెట్టిందన్నారు. శేఖర్ మాట్లాడుతూ తనపై నమ్మకముంచి ఉపాధ్యక్షుడిగా నియమించిన పార్టీ అధిష్ఠానానికి కృతజ్ఞతలు తెలిపారు.

వినాయకసాగర్ పనులు త్వరగా పూర్తి చేయండి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న కమిటీ సభ్యులు

తిరుపతి అర్బన్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి) : సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న వినాయక సాగర్ పనులను త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని వరసిద్ధి వినాయక మహోత్సవ కమిటీ సభ్యులు శుక్రవారం రాత్రి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. నెలాఖరులో వినాయకచవితి వస్తోందని, ఆలోపే పూర్తయ్యేలా చూడాలని కోరారు. సాగర్ మధ్యలో నాట్య వినాయక విగ్రహం నెలకొల్పాలని విజ్ఞప్తి చేశారు. అలాగే నిమజ్జనానికి అవసరమైన ఏర్పాట్లకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ కన్వీనర్ సామంచి శ్రీనివాస్, వూకా విజయ్‌కుమార్, ఆర్సీ మునికృష్ణ, గోపినాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

తిరుపతి(ఆటోనగర్), ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): తిరుపతి టౌన్ డివిజన్ పరిధిలో విద్యుత్ లైన్లు మరమ్మతు చేస్తున్న కారణంగా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆ డివిజన్ ఈఈ వి.చంద్రశేఖరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వరదరాజనగర్, సిరిపురంకాలనీ, యశోదానగర్, సీపీఎం కార్యాలయ సమీప ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఆరుగురికి జరిమానా

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో మద్యం తాగి వాహనాలు నడిపిన ఆరుగురికి జరిమానా విధిస్తూ తిరుపతి నాలుగవ అదనపు జ్యుడిషియల్ న్యాయమూర్తి గ్రంధి శ్రీనివాస్ శుక్రవారం తీర్పు చెప్పారు. ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున జరిమానా విధించారు.

గిరిజనులకు రాజకీయ రిజర్వేషన్ కల్పించాలి

తిరుపతి(జీవకోన), ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): గిరిజనులకు రాజకీయంగా రిజర్వేషన్లు కల్పించాలని గిరిజన ప్రజా సమాఖ్య జాతీయ అధ్యక్షుడు వడిత్యా శంకర్‌నాయక్ కోరారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి గిరిజనుల అభివృద్ధికి ప్రభుత్వాలు సహకరించకపోవడం బాధాకరమన్నారు. జిల్లాలను యూనిట్‌గా పరిగణించి గిరిజనులకు రిజర్వేషన్ కల్పించాలన్నారు. మైదాన ప్రాంతాల్లోని గిరిజనులను సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఆదుకునేలా రాజకీయ పార్టీలు, ప్రభుత్వాలు చొరవ చూపాలన్నారు. అనంతరం గిరిజన ప్రజా చైతన్య యాత్ర పోస్టర్‌ను అవిష్కరించారు.



సుధా రఘునాథన్ - గాయని ఉష

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల శ్రీవారిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో ప్రముఖ గాయని పద్మభూషణ్ సుధా రఘునాథన్, సినీ గాయని ఉష, ఢిల్లీ మంత్రి పర్వేష్ వర్మ ఉన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



చెంగాళమ్మకు పుష్పయాగం

శ్రావణ మాసం రెండో శుక్రవారం సందర్భంగా సూళ్లూరుపేటలోని చెంగాళమ్మకు పుష్పయాగం నిర్వహించారు. ఆస్థాన మండపంలో అమ్మవారి ఉత్సవమూర్తికి 20 రకాల పుష్పాలు, 6రకాల పత్రాలతో పుష్పార్చన చేశారు. చామంతి, సంపంగి, రోజా, తామర, కనకాంబరం, మల్లె, గన్నేరు, నూరు వరహాలు, గన్నేరు, మొగలిరేకులు,మానససంపంగి పుష్పాలు, తులసి, మరువం, దవణం, బిల్వం, పన్నీరు, కదరిపచ్చ పత్రాలను వినియోగించారు. చెన్నైకి చెందిన నంబూరు మోహన్‌రావు, సులోచనమ్మ, నంబూరు మనోజ్‌సాయి, లత దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. సహాయ కమిషనర్ ప్రసన్నలక్ష్మి, ట్రస్టుబోర్డు మాజీ సభ్యులు ఆకుతోట రమేష్, ముంగర అమరావతి, భక్తులు పాల్గొన్నారు. - సూళ్లూరుపేట, ఆంధ్రజ్యోతి



అమ్మవారి పాదాల చెంత పూజలుచేసి పుష్పాలను తీసుకొస్తున్న ఉభయదాతలు

సర్వదర్శనానికి 14 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 2 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

బుధవారం హుండీ ఆదాయం: రూ.4.66 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 66,149

తలనీలాలు సమర్పించినవారు: 24,429



కథనం, ఇంటర్వ్యూ : తిరుపతి, ఆంధ్రజ్యోతి



నేడు

నగరి మండలం గుండ్రాజుకుప్పం పంచాయతీ మారుతీనగర్‌లో రూ.8.40 లక్షలతో కొత్తగా నిర్మించిన సిమెంటు రోడ్డు



నాడు

అదే చోట రోడ్డు వేయకముందు పరిస్థితి



నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్

రూ.123 కోట్లతో అభివృద్ధి చేశా!

చిత్తూరు, తిరుపతి.. రెండు జిల్లాల్లో భాగంగా ఉన్న నియోజకవర్గం నగరి. తమిళనాడు సరిహద్దుల్లో ఉన్న ఈ నియోజకవర్గంలో రచ్చలూ రావిళ్లతోనూ రాజకీయాలు నడుస్తాయి. పార్టీ ఏదైనా ఇక్కడ గ్రూపులు సహజం. ఏకతాటిపై నడక అసాధ్యం. ఇటువంటి చోట టీడీపీ ఎమ్మెల్యేగా 2024లో తొలి విజయం అందుకున్నారు గాలి భానుప్రకాష్. తండ్రి దివంగత గాలి ముద్దుకృష్ణమనాయుడు తరహాలోనే నిరంతరం జనంలో ఉంటారు. జనం చెప్పింది వింటారు. చేయగలిగిందే చెబుతారు. చెప్పింది వెంటనే చేస్తారు. నగరి నియోజకవర్గంలో అభివృద్ధి ముద్రతో మరింత ఎదగాలని ఆశపడుతున్న గాలి భానుప్రకాష్‌తో తొలి ఏడాది పాలనపై ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ...

ప్రోగ్రెస్ రిపోర్ట్

వడమాలపేటలో ఫైవ్‌స్టార్ లగ్జరీ రిసార్టులు

నగరి నియోజకవర్గాన్ని పర్యాటక పరంగా అభివృద్ధి చేయడంపై ప్రత్యేక దృష్టి సారించా. ఆతిథ్య రంగంలోనూ పెట్టుబడులు రప్పించడానికి ప్రయత్నిస్తున్నా. దానివల్ల స్థానిక యువతకు ఉపాధి దొరుకుతుంది. వ్యక్తిగత చొరవతో ఫైవ్ స్టార్, సెవెన్ స్టార్ రిసార్టులు, హోటళ్ల ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నా. మొదటి ప్రయత్నంగా వడమాలపేట మండలం ఎస్వీపురం వద్ద పర్యాటక శాఖకు 12 ఎకరాల భూమిని ఇటీవలే ప్రభుత్వం కేటాయించేలా చూశా. ఆ భూమిని పర్యాటక శాఖ అట్మోస్ఫియర్ కోర్ అనే సంస్థకు ఫైవ్ స్టార్ లగ్జరీ రిసార్టుల కోసం కేటాయించనుంది.



తిరుమలకుప్పంలో నిర్మాణంలో ఉన్న 33/11 కేవీ విద్యుత్తు సబ్‌స్టేషన్

గాలి భానుప్రకాష్

పుట్టిన తేదీ: జూన్ 20,

తల్లిదండ్రులు : గాలి సరస్వతమ్మ, గాలి ముద్దుకృష్ణమనాయుడు

చదువు: అమెరికాలో మాస్టర్స్,

కుటుంబం: భార్య గాలి శిరీష, కుమారులు గాలి కృష్ణ, గాలి రామ్‌నాయుడు

● నగరి మండలం గుండ్రాజుకుప్పం, పుత్తూరు మండలం తిరుమలకుప్పంలో విద్యుత్ సబ్‌స్టేషన్లు మంజూరు చేయించా. తిరుమలకుప్పంలో నిర్మాణం దాదాపు పూర్తి కావచ్చింది. గుండ్రాజుకుప్పంలో పనులు త్వరలో ప్రారంభమవుతాయి.

గ్రావెల్.. లా అండ్ ఆర్డర్.. అండర్ కంట్రోల్

గతంలో నగరి నియోజకవర్గం గ్రావెల్ అక్రమ రవాణాకు పేరుమోసింది. అలాగే శాంతి భద్రతలు కూడా సక్రమంగా వుండేవి కావు. ఈ రెండింటి పట్ల కఠిన వైఖరి తీసుకున్నాం. ఇపుడు నియోజకవర్గం మొత్తం మీద ఎక్కడా గ్రావెల్ అక్రమ రవాణా అన్న మాటే వినిపించడంలేదు.

ఏడాదిలో ఏం చేశారు?

పల్లెలకు బస్సులు

పుత్తూరు డిపో పరిధిలో ఈ ఏడాది కాలంలోనే ఎనిమిది కొత్త బస్సు సర్వీసులు ప్రారంభించాం. అగరంపేట నుంచి 9వ మైలు, కండ్రిగల మీదుగా నగరికి, వెంగళత్తూరు నుంచి నిండ్ర మీదుగా పిచ్చాటూరుకు, పరమాల నుంచి కుప్పం బాదూరు, బట్టి కండ్రిగల మీదుగా పుత్తూరుకు, ఎగువ పుత్తూరు నుంచి పాలమంగళం, సుబ్బానాయుడు కండ్రిగల మీదుగా పుత్తూరుకు, ఎలకటూరు నుంచి కావనూరు, కీలంబాకం, ఆరూరు మీదుగా నగరికి, పుత్తూరు నుంచి నారాయణవనం, గోవిందప్ప నాయుడు కండ్రిగ మీదుగా కైలాసకోనకు... ఇలా ఆరు మార్గాల్లో ప్రారంభించాం.







నిండ్ర మండలం కైపాకం పంచాయతీలో రూ.15 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్

వచ్చే నెల నుంచీ మరమగ్గాలకు ఉచిత కరెంటు



నగరి, పుత్తూరు, నారాయణవనం మండలాల్లో 5500 మంది మరమగ్గాల కార్మికులున్నారు. మరమగ్గాలకు 500 యూనిట్ల వరకూ ఉచిత కరెంటు ఇవ్వాలని ఎన్నికలకు ముందే సీఎం చంద్రబాబును కోరా. ఆయన ఆమోదించారు. ఆగస్టు విద్యుత్ బిల్లు సెప్టెంబరులో వస్తుంది. ఆ బిల్లు నుంచీ ఉచిత విద్యుత్ అమల్లోకి రానుంది. నగరిలో 5500 మందికి లబ్ధి కలగనుంది.

ఇవి చేశాం

●రూ. 23.41 కోట్లతో 45 కిలోమీటర్ల సీసీ రోడ్ల నిర్మాణం మొదలు. 32 కిలోమీటర్లు పూర్తి.

●రూ. 13 కోట్లతో గోకులం షెడ్లు పూర్తి అయ్యాయి.

●తుడా నుంచి రూ. 34.18 కోట్లతో తారు రోడ్లు, సీసీ రోడ్లు, తాగునీటి పథకాలు మంజూరు చేయించాం. రూ. 32 కోట్లతో తాగునీటి పథకాల పనులన్నీ పూర్తయ్యాయి.

●నియోజకవర్గంలో జడ్పీ, ఆర్ అండ్ బీ శాఖల నుంచీ రూ. 12.56 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణం, తారు రోడ్ల మరమ్మతులు, తాగునీటి పథకాల పనులు మంజూరయ్యాయి. రూ. 1.61 కోట్లతో తాగునీటి పనులు పూర్తయ్యాయి. మరో రూ. 4.80 కోట్లతో 90 కిలోమీటర్ల మేర సీసీ రోడ్ల నిర్మాణం జరిగింది. ఆర్ అండ్ బీ ద్వారా రూ. 6.15 కోట్లతో 190 కిలోమీటర్ల మేర రోడ్లకు ప్యాచ్ వర్కులు చేపట్టాం.

రూ.68 లక్షలతో బాగుపడిన విజయపురం మండలంలోని నెట్టేరి- కనకమ్మసత్రం రోడ్డు



చంద్రబాబును కోరుతున్నది ఇవే!

●పుత్తూరు ప్రభుత్వాసుపత్రిని వంద పడకలకు స్థాయికి పెంపు

●గాలేరు-నగరి సుజల స్రవంతిని పూర్తి చేయాలి.

● వడమాలపేటలో ఈఎంసీ-3 ఏర్పాటు.

●నగరిలో టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు. దానికోసం వీకేఆర్‌పురం వద్ద 150 ఎకరాలు గుర్తించాం.

ఇవి చేయాలి

● రూ. 1.20 కోట్లతో 2.45 కిలోమీటర్ల సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాల్సి వుంది. ఇంకో రూ. 8.67 కోట్లతో 12.16 కిలోమీటర్ల మేరకు పనులు ప్రతిపాదించడం జరిగింది. రూ. 40.54 కోట్లతో 37.76 కిలోమీటర్ల మేరకు తారు రోడ్ల నిర్మాణం చేపట్టాల్సి వుంది.

● రూ. 70 లక్షల తుడ నిధులతో 1.17 కిలోమీటర్ల తారు రోడ్డు చేపట్టాల్సి వుంది. అలాగే రూ. 1.48 కోట్లతో 2.44 కిలోమీటర్ల సీసీ రోడ్లు నిర్మించాల్సి వుంది.

● నియోజకవర్గంలో ఆరు విద్యుత్ సబ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలి. ● ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటు చేయాలి. ఇందు కోసం విజయపురం మండలం కోసలనగరంలో 500 ఎకరాలు గుర్తించాం. ● నగరి వద్ద ఏకాంబరకుప్పం, అలాగే పుత్తూరులో ఆర్డీఎం గేటు, మరాఠీ గేటు తదితర మూడు రైల్వే లెవల్ క్రాసింగులున్న చోట్ల ఆర్వోబీల నిర్మాణం కోసం రైల్వే ఉన్నతాధికారులను కలసి ప్రతిపాదనలు అందజేశా. ● పుత్తూరు నుంచీ చెన్నై వరకూ ఇపుడున్న డబుల్ రోడ్డును సిక్స్ లేన్‌గా విస్తరించాలని ఢిల్లీలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కలసి కోరాను.

మహిళా ఎమ్మెల్యేని కించపరిచిన వ్యక్తికి పరామర్శా?

● జగన్ తీరు మార్చుకోకపోతే సింగిల్ డిజిట్టేనన్న ఎమ్మెల్యే విజయశ్రీ

సూళ్లూరుపేట, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఒక మహిళా ఎమ్మెల్యేపై అసభ్యకరంగా మాట్లాడి కించపరరిచిన మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్ రెడ్డిని జగన్ పరామర్శించడం సిగ్గుచేటని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. మాజీ ఎమ్మెల్యేలు, వైసీపీ నాయకులు ఇతరులను హేళనగా మాట్లాడితే ఖండిచాల్సిన అధినేతే, వారిని పరామర్శించి రెచ్చగొట్టేలా మాట్లాడటం మంచి పద్ధతి కాదన్నారు. జగన్ తీరు మార్చుకోకపోతే ఈసారి సింగిల్ డిజిట్‌కే పరిమితమవ్వడం ఖాయమని జోస్యం చెప్పారు. సూళ్లూరుపేటలో శుక్రవారం ఆమె మాట్లాడుతూ, నెల్లూరు పర్యటనలో అనుమతి లేకపోయిన రెచ్చగొట్టే మాటలు మాట్లాడి పోలీసులను తోసేసి తాము అధికారంలోకి వస్తే చంపుతాం.. నరుకుతాం.. అధికారులను జైలుకు పంపుతామని మాజీ సీఎం హోదాలో మాట్లాడటం రికాదన్నారు.

నాటు బాంబు పేలి ఉపాధి కూలీకి తీవ్రగాయాలు




గాయపడిన జమునమ్మ

నాగలాపురం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): నాటు బాంబు పేలి ఉపాధి కూలీకి తీవ్ర గాయాలయ్యాయి.ఈ సంఘటన శుక్రవారం నాగలాపురం మండలంలో చోటు చేసుకుంది. బాధితురాలి కథనం మేరకు... కస్తూరినాయుడు కండ్రిగ ఎస్టీ కాలనీ అటవీ ప్రాంతంలో శుక్రవారం ఉదయం ఉపాధి కూలీలు పనులు చేపట్టారు. ఆ సమయంలో సురుటుపల్లి పంచాయతీలోని లింగమనాయుడు కండ్రిగ గ్రామానికి చెందిన కూలీ జమునమ్మ(60) పనులు చేస్తుండగా గుర్తుతెలియని వ్యక్తులు వేట కోసం పెట్టిన నాటు బాంబు ఆమె చేతికి తగిలి పేలిపోయింది. ఎడమ చేతికి తీవ్ర గాయాలపాలైంది. వెంటనే అక్కడి ఫీల్డ్ అసిస్టెంట్, ఉపాధి కూలీలు ఆమెను సమీప తమిళనాడు ప్రాంతంలోని ఊత్తుకోట జీహెచ్‌కి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. మెరుగైన చికిత్స నిమిత్తం చెన్నై స్టాండ్లీ ఆస్పత్రికి తరలించారు. దీనిపై ఫీల్డ్ అసిస్టెంట్ మోహన, బాధితురాలు బంధువులు నాగలాపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సత్యవేడు పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. వివరాలు నమోదు చేసుకున్నారు.

ప్రసన్న మృతిపై దర్యాప్తు ముమ్మరం: సీఐ

ఏర్పేడు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండలం మన్నసముద్రం గ్రామానికి చెందిన ప్రసన్న(30) 20రోజుల క్రితం దొంగతనానికి పాల్పడిందని పక్కింటి వారు వేధించి.. దాడి చేయడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకుంది. ఈ విషాదకర ఘటనపై 'ఆంధ్రజ్యోతి'లో శుక్రవారం వార్త ప్రచురితమైంది. దీనిపై ఏర్పేడు సీఐ శ్రీకాంత్ రెడ్డి కేసు దర్యాప్తును ముమ్మరం చేశారు. పోలీసు సిబ్బందిని మన్నసముద్రం పంపి విచారణ చేపట్టారు. పరారీలో ఉన్న నిందితుల కోసం ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నారు. త్వరలో వారిని పట్టుకుని చర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు.

9వ బెటాలియన్ కమాండెంట్ బాధ్యతల స్వీకరణ



ఈఎస్ఎస్ ప్రసాద్

వెంకటగిరి టౌన్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): వల్లివేడు వద్ద ఉన్న 9వ బెటాలియన్ కమాండెంట్‌గా ఈఎస్ఎస్ ప్రసాద్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... అమరావతి డీజీపీ కార్యాలయంలో కమాండెంట్‌గా విధులు నిర్వహిస్తూ 9వ బెటాలియన్‌కు బదీలిపై వచ్చానన్నారు. బెటాలియన్ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. సిబ్బంది పనితీరుపై ప్రత్యేక దృష్టి పెట్టి, వారి సమస్యల పరిష్కరిస్తానన్నారు. అనంతరం సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ అరుణ్‌బోస్, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులపై దాడులు చేస్తున్నారు

● మేర్లపాక టోల్‌ప్లాజా సిబ్బందిపై కేంద్రమంతిరకి బీజేపీ ఫిర్యాదు



కేంద్రమంత్రికి ఫిర్యాదు చేస్తున్న సామంచి శ్రీనివాస్

తిరుపతి(ఉపాధ్యాయనగర్), ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండలం (జాతీయ రహదారి 71) మేర్లపాకలోని టోల్‌ప్లాజా సిబ్బంది స్థానిక రైతులపై దాడులకు దిగుతున్నారని కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రి నితిన్ గడ్కరీకి బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ ఫిర్యాదు చేశారు. శ్రీవారి దర్శనార్థం జిల్లాకు వచ్చిన గడ్కరీని శుక్రవారం రాత్రి రేణిగుంట విమానాశ్రయంలో కలిసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా టోల్‌ప్లాజా నిర్వాహకులపై ఫిర్యాదు చేశారు. టోల్‌ప్లాజా సమీప ప్రాంతాల్లో జాతీయ రహదారి పనులు ఇంకా పూర్తికాలేదని, టోల్‌ప్లాజా నిర్వహణ కూడా సరిగా లేదని, అయినా, అధిక ధరలు వసూలు చేస్తున్నారని వివరించారు. టోల్‌ప్లాజా ప్రాంతాల్లో పొలాలకు రైతులు అటు, ఇటు వాహనాల్లో తిరుగుతుంటారన్నారు. ఇక, ప్లాజాలో కనీసం రూ.140, అత్యధికంగా రూ.895 వసూలు చేస్తుండటంతో రైతులు వాహనాల్లో పొలాలకు వెళ్లి రావడం ఇబ్బందిగా మారిందన్నారు. దీనిపై ప్రశ్నిస్తే సిబ్బంది రైతులపై దాడులకు దిగుతున్నారని ఆరోపించారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, బీజేపీ నేత కోలా ఆనంద్ కూడా ఇదే విషయాలను కేంద్రమంత్రికి చెప్పారు. దీంతో పక్కనున్న జాతీయ రహదారుల ప్రాజెక్ట్ డైరెక్టర్ వెంకటేశ్వర్లును పిలిచి ఆ టోల్‌ప్లాజా పరిస్థితి గురించి అడగ్గా.. అన్నీ సక్రమంగా ఉన్నాయని చెప్పారు. పూర్తి వివరాలతో తమ పార్టీ నాయకులు వివరించారంటూ కేంద్ర మంత్రి చెప్పారు. టోల్‌ప్లాజా నిర్వహణ సంస్థను తప్పించాలని, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని పీడీని ఆదేశించారు. కేంద్ర మంత్రి వెంట రాష్ట్ర మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఉన్నారు.

అక్రమాలకు బాస్.. జగన్

● మహిళలకు క్షమాపణలు చెప్పాలన్న టీడీపీ



తిరుపతి(జీవకోన), ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో రాష్ట్రంలో జరిగిన అన్ని అక్రమాలకు బాస్.. జగన్ అని తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్ అన్నారు. త్వరలోనే మరిన్ని అక్రమాలు బయటకు రానుండటంతో డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నాడని విమర్శించారు. తన అక్రమాలకు ఎపుడు అరెస్టు అవుతారో జగన్‌కే తెలియని పరిస్థితి ఏర్పడిందన్నారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ, అధికారం కోల్పోవడం.. లిక్కర్ కేసులో ఆ పార్టీ నేతలు జైళ్లకు వెళ్లడంతో జగన్ మెంటల్ కండిషన్ సరిగాలేక చంద్రబాబుపై విమర్శలు చేస్తున్నారన్నారు. సభ్య సమాజం తలదించుకునేలా మహిళలపై నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను సమర్థించిన జగన్.. మహిళా లోకానికి క్షమాపణ చెప్పాలని డిమాండు చేశారు. పెద్దిరెడ్డి ఎపుడో చంద్రబాబును కొట్టాడని, అందువల్లే మిథున్‌రెడ్డిపై కక్ష సాధిస్తున్నారని తప్పుడు ప్రచారాలు చేయడం జగన్ దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. శాంతి భద్రతలకు జగన్ విఘాతం కలిగిస్తున్నారని డిప్యూటీ మేయర్ ఆర్‌సీ మునికృష్ణ ఆరోపించారు. ఈ సమావేశంలో రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్‌వర్మ, నేతలు మన్నెం శ్రీనివాసులు, హేమంత్ యాదవ్, సుబ్బుయాదవ్, రామారావు పాల్గొన్నారు.

జగన్‌రెడ్డీ.. ఇదేమి తీరు!

● అన్ని ఆధారాలతోనే చెవిరెడ్డి అరెస్టు జరిగిందన్న తుడా చైర్మన్



తిరుపతి, ఆగస్టు1(ఆంధ్రజ్యోతి): 'మహిళా ఎమ్మెల్యేని అసభ్యకరంగా మాట్లాడిన ప్రసన్నకుమార్ రెడ్డిని.. ఒక తల్లిని అనరాని మాటలన్న వల్లభనేని వంశీని జగన్మోహన్‌రెడ్డి పరామర్శించడం విడ్డూరంగా ఉంది. తన కారు కింద పడి మృతి చెందిన కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించలేని ఆయన.. అరెస్టయిన గంజాయి ముఠా నాయకులను, రౌడీషీటర్లు, స్త్రీలను అగౌరవంగా మాట్లాడుతున్న సంస్కారంలేని నాయకులను పరామర్శించడం ఏమిటి? జగన్ తీరు మార్చుకోకపోతే ప్రజలు ఓట్లు కాదు కదా.. రోడ్లమీదా తిరగనివ్వరు' అని తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్‌రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం తిరుపతిలోని తన నివాసంలో ఆయన ఆయన మీడియాతో మాట్లాడారు. ఇప్పుడు రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు ప్రశాంతంగా జీవిస్తుంటే, తన ఉనికికోసం జగన్ పరామర్శల పేరుతో తిరుగుతూ అలజడి సృష్టించాలని ప్రయత్నిస్తున్నారన్నారు. లిక్కర్ స్కాంలో ప్రతినెలా రూ.500 కోట్లు దోచేశారన్నారు. ఈ స్కామ్‌లో చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని పక్కా ఆధారాలతోనే అరెస్ట్ చేశారన్నారు. ఆయన పీఏలు, గన్‌మ్యాన్‌లు ఎక్కడెక్కడ డబ్బులు తీసుకొచ్చారు? ఎక్కడ దాచిపెట్టారు? ఎవరికి ఇచ్చారు? వారి వాహనాలు ఎక్కడ తిరిగాయనే శాటిలైట్ ఆధారాలు సిట్ వద్ద ఉన్నాయన్నారు.

పుత్తూరు వార్తలు

నిరుపేదలకు భరోసాగా ఎన్టీఆర్ పెన్షన్

● ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్



అర్హులకు పింఛన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్

పుత్తూరు అర్బన్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): అర్హత కలిగిన నిరుపేదలకు భరోసాగా ఎన్టీఆర్ పెన్షన్ పథకం నిలుస్తోందని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే పుత్తూరు మున్సిపాలిటీ పరిధిలో 1వ వార్డు కట్టకింద రామకృష్ణాపురం, 24వ వార్డు లక్ష్మీనగర్‌లలో పర్యటించారు. లబ్ధిదారులకు పెన్షన్‌లను పంపిణీ చేశారు. పట్టణ పరిధిలో వృద్ధాప్య, వితంతువు, వికలాంగుల పెన్షన్లతో పాటు కొత్తగా మంజూరైన 2 డయాలసిస్ పెన్షన్‌లు, 129 వితంతువు పెన్షన్లు పంపిణీ చేశారు. నియోజకవర్గంలో కొత్తగా 703 పెన్షన్‌లు మంజూరయ్యాయని వివరించారు. ఈ కార్య క్రమంలో మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్, వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ షణ్ముగరెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు గాలి జీవరత్నం నాయుడు, మున్సిపల్ మాజీ చైర్మన్ యుగంధర్, మధు, నాగేంద్ర, గోపి తదితరులు పాల్గొన్నారు.

ముర్రుపాలతో శిశువుకు వ్యాధి నిరోధక శక్తి



పుత్తూరు అర్బన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ముర్రుపాలతో శిశువుకు వ్యాధి నిరోధక శక్తి వస్తుందని డాక్టర్ హేమభూషణ్ రెడ్డి పేర్కొన్నారు. తల్లిపాల వారోత్సవాలలో భాగంగా శుక్రవారం ఉత్తరపుకండిగ హరిజనవాడ అంగన్వాడీ కేంద్రంలో గర్భిణులకు తల్లి పాల ఆవశ్యకతను వివరించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనిత, ఏఎన్ఎం ఉమాకుమారి, దివ్య, అంగన్వాడీ కార్యకర్తలు రూప, వల్లియమ్మ, చంద్రమ్మ, పద్మజ, స్వప్న పాల్గొన్నారు.

ఆర్టీసీ కాంప్లెక్స్‌లో దొంగలు పడ్డారు..!

పుత్తూరు అర్బన్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): పుత్తూరు ఆర్టీసీ కాంప్లెక్స్‌లో దొంగలు పడ్డారు. గురువారం కాంప్లెక్స్‌లోని దుకాణాల పైకప్పులు తొలగించి చోరీకి పాల్పడ్డారు. టెక్స్‌మో డీలర్ షాపులో సుమారు రూ.25 వేలు చోరీకి గురైనట్లు గుర్తించారు. కలాం కూల్‌డ్రింక్స్ దుకాణంలో రూ.6 వేలు నగదును దోచుకెళ్లారు. పోలీసులు దుకాణాలను పరిశీలించారు. దుకాణదారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలని సీఐకి వినతి

పుత్తూరు అర్బన్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): పుత్తూరులో ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సీఐ శేఖర్‌రెడ్డిని సీపీఐ నాయకులు కోరారు. శుక్రవారం వారు మర్యాదపూర్వకంగా ఆయన్ను కలిశారు. పలు అంశాలపై ఆయనకు వినతి పత్రం అందజేశారు. పుత్తూరు పట్టణం, మండల పరిధిలో నిత్యం ట్రాఫిక్ సమస్యతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. విద్యార్థులు కళాశాలలకు, స్కూళ్లకు వెళ్లేందుకు అసౌకర్యానికి గురవుతున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పుత్తూరు కార్యదర్శి మహేష్, నాయకులు గోపి, మనీ, రమేష్, రవి, భాస్కర్, రమణ, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భర్త చనిపోయిన నెలలోపే పింఛను పంపిణీ ఘనత కూటమిదే



వితంతువులకు పింఛను పంపిణీ చేస్తున్న గంజి మాధవయ్య

పుత్తూరు టౌన్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): భర్త చనిపోయిన నెల లోపే వితంతువులకు పెన్షన్ల పంపిణీ చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య పేర్కొన్నారు. శుక్రవారం పుత్తూరు రూరల్ మండలం నేసనూరు గ్రామ పంచాయతీ సచివాలయంలో నూతనంగా మంజూరైన వితంతు పెన్షన్లను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గంజిమాధవయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు బాలాజీ, ప్రధాన కార్యదర్శి హేమంత్, యూనిట్ ఇన్‌చార్జి బాలకృష్ణారెడ్డి, మోహన్, రమేష్, సుబ్బు, శరవణ, తాతయ్య తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచన, ఉపన్యాస పోటీల్లో ప్రథమస్థానం



పుత్తూరు, ఆగస్టు1 (ఆంధ్రజ్యోతి): సమాచారం హక్కు చట్టంపై ఉమ్మడి జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీల్లో స్థానిక డిగ్రీ కళాశాలకు చెందిన లావణ్యకు వ్యాసరచన పోటీల్లో, ఉపన్యాసం పోటీల్లో వరలక్ష్మి ప్రథమ బహుమతులు పొందారు. చిత్తూరులో నిర్వహించిన పోటీలలో వీరు ప్రతిభ చూపారు. ఈ క్రమంలో శుక్రవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చంద్రమౌళి వీరిని అభినందించారు. గెలుపొందిన విద్యార్థులు వచ్చే వారం కడపలో జోనల్ స్థాయి పోటీలలో పాల్గొం టారని తెలిపారు. అధ్యాపకులు కోటేశ్వరయ్య, నరసింహులు, దేవకిలు పాల్గొన్నారు.

స్వామిత్వకు సహకరించండి



కాయంపేటలో జరిగిన స్వామిత్వ అవగాహన గ్రామసభ

వడమాల పేట, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం నూతనంగా అమలు చేస్తున్న స్వామిత్వ పథకం ఇంటింటి సర్వేకు గ్రామస్థులు సహకరించాలని కాయంపేట పంచాయతీ కార్యదర్శి సుమ కోరారు. మండలంలోని పత్తిపుత్తూరు, కాయంపేట, పూడి పంచాయతీలు ప్రయోగాత్మకంగా స్వామిత్వ పథకానికి ఎంపికయ్యాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం కాయంపేటలో గ్రామ సభ నిర్వహించి గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏవో హరినాథ్‌బాబు మాట్లాడుతూ విలేజ్ సర్వేయర్లు ఇంటింటా సర్వే చేస్తున్నారని, ఇంటి యజ మానుల భద్రతే ధ్యేయంగా రికార్డుల్లో పొందుపరుస్తున్నట్లు చెప్పారు. ప్రతి ఇంటికీ హద్దుల ఆధారంగా ప్రాపర్టీ పర్సనల్ నెంబరు కేటాయిస్తారని చెప్పారు. భవిష్యత్‌లో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఎవరి ఆస్తులు వారికి దక్కేలా సర్వే చేస్తున్నట్లు చెప్పారు. గ్రామస్థుల సమగ్ర సమాచారాన్ని అందించాలని కోరారు. ఈ గ్రామసభలో టీడీపీ నాయకులు ఉమాపతిరావ్, వెంకటేష్, తులసిరామిరెడ్డి, విలేజ్ సర్వేయర్ బాలాజీ, ఇంజనీరింగ్ అసిస్టెంట్ మధు, డిజిటల్ అసిస్టెంట్ లక్ష్మీపతి, గ్రామస్థులు పాల్గొన్నారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

కుటుంబ కలహాలతో ఆత్మహత్య



ఆంజనేయప్రసాద్ మృతదేహం

కోట, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కోట మండలంలోని జరుగుమల్లి సమీపంలోని చల్లకాలువ వద్ద ఉన్న పొలాల్లో శుక్రవారం ఆంజనేయప్రసాద్ (43) అనే వ్యక్తి చెట్టుకు ఉరివేసుకుని మృతిచెందాడు. స్థానికుల కథనం మేరకు... నెల్లూరుకు చెందిన ఆంజనేయప్రసాద్ కోట మండలం నెల్లూరుపల్లికి చెందిన ఓ అమ్మాయిని పదేళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. వీరి మధ్య తరుచూ వివాదాలు వస్తుండడంతో నాలుగు సంవత్సరాల నుంచి ఆంజనేయప్రసాద్ అప్పుడప్పుడు భార్య వద్దకు వచ్చి వెళుతుంటాడు. ఈక్రమంలో గురువారం అర్ధ రాత్రి నెల్లూరుపల్లికి వచ్చి చల్లకాలువ వద్ద ఉన్న వేపచెట్టుకు ఉరివేసుకుని మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ పవన్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని, శవాన్ని పోస్టు మార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

చిత్తూరు డీఐఈవోగా రఘుపతి



వరదయ్యపాళెం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి (డీఐఈవో)గా ఎ.రఘుపతిని నియమిస్తూ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ క్రితిక శుక్లా శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ డీఐఈవోగా పనిచేస్తున్న శ్రీనివాసులు జూలై నెలలో పదవీ విరమణ చెందారు. ఈయన స్థానంలో పుంగనూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌ను ఇన్‌చార్జి డీఐఈవోగా నియమించారు. ఈ నేపథ్యంలో తిరుపతి జిల్లా వరదయ్యపాళ్యం మండలం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.రఘుపతిని రెగ్యులర్ డీఐఈవోగా నియమించారు. ఈయన శనివారం జిల్లా కార్యాలయంలో బాధ్యతలు చేపట్టనున్నారు.

నూతన పింఛన్ల పంపిణీ



వడమాలపేట, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): మండలంలో నూతనంగా 86 మందికి మంజూరైన పింఛన్లను టీడీపీ నాయకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి ధనంజయుల నాయుడు, టీడీపీ మండల అధ్యక్షులు దాముయాదవ్, నాయకులు గణపతి రాయల్, శివరాయల్, చందు తదితరులు పాల్గొన్నారు.

వాతావరణ ఆధారిత సేద్యం లాభదాయకం

వడమాలపేట,ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా, పంట విత్తే సమయాన్ని, సాగు చేయాల్సిన పంటలను రైతులు ఎంచుకుంటే మంచి దిగుబడులను పొందగలరని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి వేణుగోపాల రావు చెప్పారు. శుక్రవారం వడమాలపేట ఐటీపీఎంఆర్కేవీవై పథకం కింద రైతు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమములో ఆయన మాట్లాడుతూ ఒకే రకమైన పంటలు సాగుచేస్తే దిగుబడి తగ్గిపోతుందన్నారు. ఏవో విజయ కుమార్ ప్రతి రైతూ పంటల బీమా చేసుకోవాలని తెలియజేశారు. గ్రామ వ్యవసాయ సహాయకులు, మోహన్, శ్రీవాణి, మోహన్ రాజా, జిల్లా వనరుల కేంద్రం ఏఈఓ రవి ప్రసాద్, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి జూడో పోటీలకు వడమాలపేట విద్యార్థుల ఎంపిక



వడమాలపేట, ఆగస్టు1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి జూడో పోటీలకు స్థానిక బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. జూలై 31వ తేదీన తిరుపతిలోని శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో సబ్ జూనియర్ జూడో సంఘం ఆధ్వర్యంలో పోటీలు జరిగాయి. ఈ పోటీలలో పాఠశాలకు చెందిన విద్యార్థులు రెండు బంగారు పతకాలు, మూడు వెండి పతకాలు, ఆరు కాంస్య పతకాలు సాధించారు. ప్రణతి (8వ తరగతి)34కిలోలు విభాగంలో, షణ్ముగం (పదవ తరగతి) 60 కిలోల విభాగంలో బంగారు పతకాలు సాధించారు. కేశవ (7వతరగతి) 45 కిలోల విభాగంలో, సంతోష్ యాదవ్ (8వ తరగతి) 30 కిలోల విభాగంలో, అన్నపూర్ణ (8వ తరగతి) 57 కిలోల విభాగంలో రజత పతకాలు సాధించారు. అలాగే వినయ్ కుమార్ (10వ తరగతి) 66 కిలోల విభాగంలో, మోహిత్ (7వ తరగతి) 55 కిలోల విభాగంలో, అశ్వత్ (7వ తరగతి) 35 కిలోల విభాగంలో, చేతన్‌సాయి (9వ తరగతి) 50 కిలోల విభాగంలో, వెన్నెల (10వ తరగతి) 32 కిలోల విభాగంలో, మేఘన (7వ తరగతి) 28 కిలోల విభాగంలో కాంస్య పతకాలు సాధించారు. బంగారు పతకాలు సాధించిన ప్రణతి, షణ్ముగం ఈనెల 9,10 తేదీల్లో గుంటూరు జిల్లా పెదపరిమిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు.

పాలిటెక్నిక్ మిగులు సీట్లకు 5న స్పాట్ అడ్మిషన్లు

పుత్తూరు, ఆగస్టు1(ఆంధ్రజ్యోతి): మిగిలిపోయిన సీట్లను ఈ నెల 5వ తేదీన పిళ్లారిపట్టు పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లతో భర్తీ చేయనున్నామని ప్రిన్సిపాల్ కుమార్ తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు రెండు జతల జిరాక్స్‌కాపీలతో హాజరు కావాలని సూచించారు.

అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు

● సీఐ శేఖర్ రెడ్డి హెచ్చరిక

పుత్తూరు అర్బన్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): పుత్తూరు పట్టణ, మండల పరిధిలో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సీఐ శేఖర్ రెడ్డి హెచ్చరించారు. మట్కా, గ్యాంబ్లింగ్, గంజాయి, ఎర్రచందనం స్మగ్లింగ్ వంటి చట్ట వ్యతిరేక కార్యక్రమాలను మానుకోవాలని హితవు పలికారు. శుక్రవారం సాయంత్రం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే పీడీ యాక్టు ఓపెన్ చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లల విషయంలో బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. పట్టణంలో నెలకొన్న ట్రాఫిక్ సమస్యలను అధిగమించేందుకు సిబ్బంది సంఖ్యను పెంచాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు వివరించారు. త్వరలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరిస్తామని తెలియజేశారు. స్వీకరించాలన్నారు. పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.



శిథిలావస్థకు చేరిన జడ్పీ పాఠశాల పాత భవనం, పెచ్చులూడిపోయి ఇనుప కమ్మీలు బయటికి వచ్చిన పిల్లర్లు, శిథిల భవనంలోనే చదువుతున్న విద్యార్థులు

శిథిలావస్థలో జడ్పీ ఉన్నత పాఠశాల పాత భవనం

● ఆందోళనలో విద్యార్థుల తల్లిదండ్రులు

గూడూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నూరు జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల పాత భవనం శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారింది. గతంలో ఈ భవనంలోని తరగతి గదుల్లో 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు పాఠాలు బోధించేవారు. గత 12 సంవత్సరాలకు పైగా ఈ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో ఇదే ప్రాంగణంలో నూతన గదులు నిర్మించి, తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ పాఠశాలలో 150 మందికి పైగా విద్యార్థులు చదువులు కొనసాగిస్తున్నారు. పాత భవనాల్లో పిల్లర్లు, శ్లాబులు పెచ్చులూడి ప్రమాదకరంగా మారాయి. సెలవు దినాల్లో పాఠశాల క్రీడా మైదానంలో విద్యార్థులు, స్థానికులు పలు క్రీడలు ఆడుతుంటారు. వారు మధ్యాహ్న సమయంలో శిథిల భవనంలోనే భోజనాలు చేస్తుంటారు. కొంతమంది విద్యార్థులు వరండాలో చదువులు కొనసాగిస్తుంటారు. అయితే పెచ్చులూడి శిథిలావస్థకు చేరి నిరుపయోగంగా మారిన ఈ భవనాలు ఎప్పుడు కూలుతాయోనని విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు, విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు. ఇకనైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి ప్రమాదాలు జరగక ముందే ఈ శిథిల భవనాలను తొలగించి, ఆ స్థలాన్ని కూడా క్రీడామైదానంలో విలీనం చేసి అభివృద్ధిపరచాలని గ్రామస్థులు కోరుతున్నారు.

15 లోపు ఇళ్ల స్థలాల కేటాయింపు

● కలెక్టర్ వెంకటేశ్వర్



ట్రాక్టర్‌లో ఎక్కి ఇరకందీవిలో పర్యటిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్, పింఛన్లు పంపిణీ చేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ

తడ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఇరకందీవి ఎంతో వెనుకబడిన ప్రాంతమని ప్రభుత్వం గుర్తించిందని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. ఇరకందీవిలో గ్రామస్థులతో శుక్రవారం గ్రామ సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పూడికుప్పం గ్రామంలో 172 మందికి ఇళ్ల స్థలాలను ఈ నెల 15వ తేదీలోపు కేటాయిస్తున్నామని తెలిపారు. మిగిలిన వారికి రెండు నెలల్లో మరో చోట ఇళ్ల స్థలాలు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. వీరందరికీ ఇళ్లు నిర్మించి మౌలిక వసతులు కల్పిస్తామని తెలిపారు. ఎమ్మెల్యే విజయశ్రీ మాట్లాడుతూ ఐదేళ్లుగా ఇరకంకుప్పం గ్రామస్థుల ఇళ్లపట్టాల సమస్య పెండింగ్‌లో ఉందని తెలిపారు. అప్పటి ప్రభుత్వం పట్టించుకోకపోగా ఇంటి స్థలాలు ఇవ్వొద్దంటూ వైసీపీకి చెందిన పూడి పంచాయతీ సర్పంచ్ కోర్టులో కేసులు వేయించారని అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ సమస్యలను పరిష్కరించడంతో ఇళ్లపట్టాల పంపిణీ సులభమైందన్నారు. నెలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ మంచి చేస్తున్న ప్రభుత్వానికి అండగా ఉండాలని తెలిపారు. సమావేశంలో ఆర్డీవో జ్యోతిర్మయి, జడ్పీటీసీ ఇందుమతి, తహసీల్దారు శరత్‌బాబు, సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ, వివిధశాఖల అధికారులు, టీడీపీ నాయకులు ఆకుతోట రమేష్, సెల్వం, పళణి, శ్రీధర్, సుధాకర్, జయపాల్, రవి తదితరులు పాల్గొన్నారు. అనంతరం సామాజిక పింఛన్లను పంపిణీ చేశారు.

ఇరకందీవిలో కలెక్టర్ సుడిగాలి పర్యటన

మండల పరిధిలోని ఇరకందీవిలో కలెక్టర్ సుడిగాలి పర్యటన చేశారు. శుక్రవారం మధ్యాహ్నసమయంలో భీములవారిపాళెం పడవలరేవుకు వచ్చిన ఆయన పడవలో ఇరకంకుప్పం గ్రామానికి వచ్చారు. అక్కడ గ్రామస్థులు ఆయనను పూలతో స్వాగతం పలికారు. గ్రామస్థుల బాధలను, సమస్యలను విని పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కాగా పర్యాటకరంగ అభివృద్ధికి ఇరకందీవి ఎంతో అనుకూలమైన ప్రాంతమని కలెక్టర్ తెలిపారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ కోనసీమ జిల్లాలను ఆదర్శంగా తీసుకొని ఇక్కడ కూడా పర్యాటక అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు.

చెన్నై-గూడూరు మార్గంలో నేడు పలు రైళ్ల రద్దు

తడ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): చెన్నై-గూడూరు మార్గంలో శనివారం పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు సదరన్ రైల్వే చెన్నై డివిజన్ అధికారులు ప్రకటించారు. ఈ మార్గంలో గుమ్మిడిపూడి - కవరైపేట రైల్వే స్టేషన్‌ల మధ్య గత కొంత కాలంగా ఇంజనీరింగ్ పనులు జరుగుతున్న విషయం తెలిసిందే. దీంతో మధ్యాహ్నం 1.15 గంటల నుంచి సాయంత్రం 5.15 గంటల వరకు ఆ పనులు జరుగుతాయి. ఈ మేరకు శనివారం పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు చెన్నై డివిజన్ అధికారులు ప్రకటించారు. రద్దు అయిన రైళ్ల వివరాలు. ● చెన్నై మోర్‌మార్కెట్ కాంప్లెక్స్ నుంచి సూళ్లూరుపేటకు ఉదయం 10.15, మధ్యాహ్నం 12.10 గంటల ఈఎంయూ లోక్ రైళ్లు రద్దయ్యాయి. ● సూళ్లూరుపేట నుంచి చెన్నై మోర్‌మార్కెట్ కాంప్లెక్స్‌కు మధ్యాహ్నం 12.35, 1.15, 3.10 ● చెన్నై మోర్‌మార్కెట్ కాంప్లెక్స్ నుంచి గుమ్మిడిపూడికి ఉదయం 11.35, మధ్యాహ్నం 12.40, 1.40, 2.40, 3.05 గంటలకు ● గుమ్మిడిపూడి నుంచి చెన్నై మోర్ మార్కెట్ కాంప్లెక్స్‌కు మధ్యాహ్నం 1.00, 2.30, 3.15, 3.45, 4.30, 5.00 గంటలకు ఈఎంయూ లోక్ రైళ్లు రద్దయ్యాయి. ● చెంగల్‌పట్టు నుంచి గుమ్మిడిపూడికి ఉదయం 9.55 గంటలకు బయలుదేరివెళ్లే ఈఎంయూ లోక్ రైళ్లను మీజూరు వరకు నడపనున్నారు. ● గుమ్మిడిపూడి నుంచి తాంబరంకు మధ్యాహ్నం 3 గంటలకు బయలుదేరి వెళ్లే ఈఎంయూ లోక్ రైళ్లు, మీజూరు నుంచి బయలుదేరి వెళ్లనున్నాయి. ఈ క్రమంలో నేడు చెన్నై మోర్‌మార్కెట్ కాంప్లెక్స్-పొన్నేరి-చెన్నైమోర్ మార్కెట్ కాంప్లెక్స్‌ల మధ్య పలు ప్రత్యేక ఈఎంయూ లోకల్ రైళ్లను నడపనున్నారు. వాటివివరాలు ● చెన్నై మోర్‌మార్కెట్ కాంప్లెక్స్ నుంచి పొన్నేరికి ఉదయం 11.35, మధ్యాహ్నం 1.40, 3.05 గంటలకు ఈఎంయూ ప్రత్యేక రైళ్లు నడవనున్నాయి. ● చెన్నై బీచ్ నుంచి పొన్నేరికి మధ్యాహ్నం 12.40, 2.40, 3.45 గంటలకు ● గుమ్మిడిపూడి నుంచి మోర్‌మార్కెట్ కాంప్లెక్స్‌కు మధ్యాహ్నం 12.05 గంటలకు ● పొన్నేరి నుంచి చెన్నై మోర్‌మార్కెట్ కాంప్లెక్స్‌కు మధ్యాహ్నం 1.18, 2.48, 3.33, 4.03, 5.18 గంటలకు ఈఎంయూ ప్రత్యేక రైళ్లు నడవనున్నాయి. ● పొన్నేరి నుంచి చెన్నై బీచ్‌కు సాయంత్రం 4.47 గంటలకు ● సూళ్లూరుపేట నుంచి గుమ్మిడిపూడికి సాయంత్రం 4.30 గంటలకు ఈఎంయూ ప్రత్యేక రైలు నడవనుంది.

భూహక్కు కోసం సహకరించండి

పుత్తూరు టౌన్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో తమ సొంత ఇంటి స్థలాలు ఉన్న వారు భూహక్కులు పొందేందుకు నేటి నుంచి జరగనున్న రీసర్వేకు అధికారులకు సహకరించాలని తడుకు సర్పంచ్ బొబ్బిలి యాదవ్ అన్నారు. శుక్రవారం తడుకు సచివాయలంలో జరిగిన గ్రామ సభలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం భూయజమానులకు పూర్తి హక్కులు కల్పించేందుకు సర్వేలు నిర్వహించి, పత్రాలు, పట్టాలు సమర్పించి సమగ్రంగా చేసుకోవాలని కోరారు. అదే విధంగా పీ4 కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం తడుకు పంచాయితీలో లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. మాజీ ఎంపీటీసీలు ధనపాల్, ఆదిమండడి, ఉపసర్పంచ్ రవి, జనసేన నాయకుడు వెంకటముని, కార్యదర్శి అనిల్‌కుమార్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రావణ మాస పూజలు

పుత్తూరు టౌన్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని ద్రౌపతి ఆలయంలో మహిళలు అమ్మవారికి కుంకుమార్చనతో విశేష పూజలు నిర్వహించారు. కృష్ణ భగవానునికి పాలాభిషేకం చేశారు. గెరిగతో ఊరేగింపు వైభవంగా జరిగింది.

ధ్వజారోహణంతో ప్రారంభమైన ద్రౌపదమ్మ తిరునాళ్ల

పుత్తూరు టౌన్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): పుత్తూరులో కొలువైన ద్రౌపతీదేవి సమేత ధర్మరాజుల తిరునాళ్ల రాత్రి ధ్వజారోహణంతో ప్రారంభమైంది. ఆరేటమ్మ చైర్మన్ కృష్ణప్ప మెదలియార్, సభ్యులు మునిచంద్ర, దామోదరం, కేశవ, పీఎం.గోపాల్, మాజీ చైర్మన్ యుగంధర్, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

కూటమి పాలనలోనే ప్రజా సంక్షేమం



పింఛన్లను అందజేస్తున్న ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): కూటమి పాలనలోనే ప్రజాసంక్షేమం సాధ్యమని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జలసుధీర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని 27, 32వ వార్డులో ఆయన లబ్ధిదారులకు పింఛన్లను అందజేశారు. ● శ్రీకాళహస్తిలోని 23వ వార్డు పరిధిలో మాజీ కౌన్సిలర్ నాగమల్లి దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో ఇంటింటికివెళ్లి పింఛన్లు అందజేశారు. టీడీపీ నాయకులు వినయ్‌కుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తొట్టంబేడులో..

టీడీపీ తొట్టంబేడు మండలాధ్యక్షుడు రావిళ్ల మునిరాజానాయుడు తొట్టంబేడు మండలం ఇలగనూరు పంచాయతీ, గుర్రప్పనాయుడుకండ్రిగ, చిన్నకనపర్తి గ్రామాల్లో పింఛన్లను అందజేశారు. ఎంపీడీవో సురేంద్రబాబు, టీడీపీ నాయకులు సుశేఖర్ నాయుడు, మురళి నాయుడు, సింగమాల భాస్కరయ్య, వాసు నాయుడు, మురళినాయుడు, రమాదేవి, పెంచలయ్య, రామయ్య, మునిరత్నం,సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీసిటీని సందర్శించిన అక్షరధాం స్వామీజీలు



స్వామీజీలకు శ్రీసిటీ గురించి వివరిస్తున్న శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి

సత్యవేడు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలోని ప్రముఖ అక్షరధాం స్వామి నారాయణ్ ఆలయానికి చెందిన ఆధ్యాత్మిక గురువులు అక్షర్ ప్రేమ్, వినమ్రవదన్ శుక్రవారం శ్రీసిటీని సందర్శించారు. వీరికి శ్రీసిటీ ఎండీ రవీంద్రసన్నారెడ్డి సాదర స్వాగతం పలికారు. శ్రీసిటీ ప్రగతి ప్రత్యేకతలను వివరించారు. శ్రీసిటీ పేరులోని ఆధ్యాత్మిక ప్రాముఖ్యతను వివరించారు. స్వామీజీలు తమ పర్యటనలో భాగంగా పారిశ్రామిక వాడ పరిసరాలతో పాటు స్థానిక ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని, అక్కడ ఏర్పాటు చేసిన శ్రీసిటీ ఉద్యానవనాన్ని సందర్శించారు. అక్కడ నుంచి డైకిన్ ఏసీ పరిశ్రమకు వెళ్లి సంస్థ ప్రతినిధులతో మాట్లాడారు. శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డిని అభినందించి ఆశీర్వచనాలు అందించారు. దక్షిణ భారతదేశంలో శ్రీసిటీ కేంద్రంగా స్వామినారాయణ్ ఆలయాన్ని శ్రీసిటీలో నిర్మించాలని స్వామీజీలకు రవీంద్ర సన్నారెడ్డి విజ్ఞప్తి చేశారు.

రాష్ట్రస్థాయి జూడో పోటీలకు ఏర్పేడు విద్యార్థులు

ఏర్పేడు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): పాపానాయుడుపేట జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి జూడో పోటీలకు ఎంపికయ్యారు. జూలై 31న తిరుపతిలోని శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్సులో సబ్ జూనియర్ జూడో జిల్లాస్థాయి పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో పాపానాయుడుపేట విద్యార్థులు ముగ్గురు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. మొత్తం మూడు బంగారు పతకాలు, ఏడు రజతం, మూడు కాంస్య పతకాలు సాధించారు. 7వ తరగతి విద్యార్థిని మనస్వి 28 కిలోల విభాగంలో, కాజల్ 32 కిలోల విభాగంలో, 8వ తరగతి విద్యార్థిని యామిని 40 కిలోల విభాగంలో బంగారు పతకాలు సాధించారు. రజత పతకాలు సాధించిన వారిలో 8వ తరగతి విద్యార్థులు భార్గవి, చందన, లతిక, ఏడవ తరగతి విద్యార్థి కార్తీక్, 9వ తరగతి విద్యార్థి తరుణ్‌సాయి ఉన్నారు. హెచ్ఎం మారయ్య, విద్యార్థులతో పాటు పీఈటీ పుష్పవాణిని అభినందించారు.

పల్లం పాఠశాల విద్యార్థుల ప్రతిభ

గూడూరు చాంపియన్ షిప్ జిల్లాస్థాయి సబ్ జూనియర్ కాంపిటీషన్ పోటీల్లో పల్లం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచినట్లు ఉపాధ్యాయుడు ఆనంద్ తెలిపారు. నలుగురు బంగారు పతకాలు, 9మంది రజత పతకాలు సాధించడంతో సన్మానించి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ నెల 8న గుంటూరులో జరిగే రాష్ట్రస్థాయి జూడో సబ్ జూనియర్ పోటీల్లో పాల్గొని జాతీయస్థాయికి ఎంపిక కావాలని ఆకాంక్షించారు. ఇందులో పల్లం సాంఘిక సంక్షేమశాఖ వసతిగృహంలో చదువుతున్న విద్యార్థులు రాము, లక్ష్మణ్ బంగారు పతకాలు సాధించారు. జ్ఞానేష్, హర్షవర్ధన్ రజత పతకాలు సాధించారు. వీరితో పాటు విష్ణు, గాయత్రి మొత్తం పల్లం పాఠశాల నుంచి నలుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి జూడో పోటీలకు ఎంపికైనట్లు వివరించారు.



జూడో పోటీలో ప్రతిభకనబరచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేసిన పల్లం పాఠశాల ఉపాధ్యాయుల బృందం

పదోన్నతులు కల్పించాలి



నిరసన తెలుపుతున్న ఏపీటీఎఫ్ నాయకులు

శ్రీకాళహస్తి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని ఏపీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. శ్రీకాళహస్తి మండలం ముచ్చివోలు జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. వారు మాట్లాడుతూ జడ్పీ ఉన్నత పాఠశాలల్లో 93శాతం మంది ఉపాధ్యాయులు పనిచేస్తుండగా వారు పదోన్నతులకు నోచు కోకుండా కేవలం ఎస్‌జీటీలుగా, స్కూల్ అసిస్టెంట్లుగానే పదవీ విరమణ పొందుతు న్నారన్నారు. ఎంఈవోలు, డీవైఈవోలు, కళాశాల అధ్యాపకులుగా పదోన్నతులు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆపస్ తిరుపతి జిల్లా అధ్యక్షుడు తూకివాకం నాగరాజు, ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు చిరంజీవి, ఉపాధ్యాయులు సుబ్రహ్మణ్యశర్మ తిరుమలయ్య, షేక్ మహమ్మద్, నిర్మల, వ్యాయామ దర్శకులు కిషోర్, చంద్రశేకర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంపై వ్యాఖ్యలు గర్హనీయం



మాట్లాడుతున్న రెడ్డివారి గురవారెడ్డి

శ్రీకాళహస్తి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబుపై మాజీ ముఖ్యమంత్రి జగన్ వ్యాఖ్యలు గర్హనీయమని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధిరెడ్డివారి గురవారెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు కక్షసాధింపు చర్యలకు పాల్పడు తున్నారని జగన్ చెప్పడం హాస్యాస్పదమన్నారు. అక్రమాలు చేసిన వారే జైలుకు పోతున్నారని పేర్కొన్నారు. చంద్రబాబును బావిలో దూకాలని జగన్ చెబుతున్నారని కానీ ప్రజలే వైసీపీకి 11 సీట్లకు పరిమితం చేసి ఆ పార్టీని బంగాళాఖాతంలో కలిపేశారన్నారు. ప్రభుత్వం చేసే సంక్షేమం ఓర్వలేకనే జగన్ ఇలా మతిభ్రమంచి మాట్లాడుతున్నారని పేర్కొన్నారు.

హీరో మంచు విష్ణుకు సాదర స్వాగతం



రేణిగుంట ఆగస్టు 1(ఆంధ్ర జ్యోతి): ప్రముఖ సినీ హీరో మంచు విష్ణుకు సాదర స్వాగతం లభించింది. శుక్రవారం రాత్రి విమానాశ్రయంలో కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకు స్వాగతం పలికేందుకు పెద్ద ఎత్తున బీజేపీ నాయకులు తరలివచ్చారు. ఆ సమయంలో హైదరాబాదు నుంచి తిరుపతి విమానాశ్రయం చేరుకున్న విష్ణుకు బీజేపీ మండల అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ రెడ్డి, నాయకులు నరేష్ రాయల్, అభిమానులు సాదర స్వాగతం పలికారు. అనంతరం ఆయన రోడ్డు మార్గాన రంగంపేటకు బయలుదేరి వెళ్లారు.

వనసంరక్షణ సమితి కమిటీ ఎన్నిక



ఏర్పేడు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని కృష్ణంపల్లి ప్రాథమిక పాఠశాల వద్ద వన సంరక్షణ సమితి సభ్యులను ఎన్నుకున్నారు. సర్పంచ్ గాదె రాజేశ్వరి అధ్యక్షతన పోలీసు, రెవెన్యూ అధికారుల సమక్షంలో సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సభ్యులుగా చంద్ర శేఖర్, జయకృష్ణారెడ్డి, కృష్ణారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, అమరావతి, వెంకటముని, పవన్‌కుమార్, సుశీల, మునిరెడ్డి, ఉషారాణి, హరినాథ్‌రెడ్డి, భూదేవి, రామమూర్తి, జ్యోతి, సుబ్బమ్మ, మణెమ్మను ఎన్నుకున్నారు. డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ సికిందర్‌బాబు, గౌస్ కరీం, సెక్షన్ అధికారి శంకరప్ప, బీటు ఆఫీసర్‌పురుషోత్తం, శోభారాణి, జ్యోతి పాల్గొన్నారు.

పింఛన్ల పండుగ



ఏర్పేడు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): పింఛన్ల పంపిణీని శుక్రవారం అన్ని గ్రామాల్లో పండుగ వాతావరణంలో అందించారు. అంజిమేడు గ్రామంలో ఏపీసీడ్స్ మాజీ డైరెక్టర్ శివశంకర్‌రెడ్డి చేతుల మీదుగా నూతనంగా మంజూరైన నాలుగు పింఛన్లు అందించారు. అదేవిధంగా బండారుపల్లిలో టీడీపీ టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గురవారెడ్డి చేతులమీదుగా పంపిణీ చేశారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఏర్పేడు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే టీడీపీ ధ్యేయమని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డివారి గురవారెడ్డి అన్నారు ఏర్పేడు మండలం చింతలపాళెం గ్రామంలో శుక్రవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పొన్నారావు, నాగరాజు నాయుడు, ధనంజయలునాయుడు, శివశంకర్‌రెడ్డి, చంద్రశేఖర్‌నాయుడు, రాఘవేంద్రరావు, వెంకటరత్నం పాల్గొన్నారు.

శ్రీసిటీ - ట్రిపుల్ ఐటీలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సత్యవేడు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): శ్రీసిటీలోని ట్రిపుల్ ఐటీ కళాశాలలో పూర్వ విద్యార్థుల సమావేశాన్ని సందడిగా నిర్వహించారు. అసోసియేట్ డీన్ (పూర్వ విద్యార్థి) ఆధ్వర్యంలో సాగిన ఈ కార్యక్రమంలో ప్రస్తుత గ్రాడ్యుయేట్లు, పూర్వ విద్యార్థులు, డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం.వీ.కార్తికేయన్, రిజిస్ట్రార్, డీన్, అధ్యాపక బృందం పాల్గొన్నారు. పూర్వ విద్యార్థులను అభినందిస్తూ కళాశాలతో అనుబంధాన్ని కొనసాగించాలని కోరారు. ఈ సమ్మేళనంలో గ్రాడ్యుయేట్లు, మెంటార్లతో తమకున్న అనుబంధాన్ని, జ్ఞాపకాలను, అనుభూతులను పంచుకున్నారు. ట్రిపుల్ ఐటీ - శ్రీసిటీ పూర్వ విద్యార్థుల నెట్‌వర్క్‌ను లాంఛనంగా ప్రారంభించారు. ఇందులో 2025 వరకు ప్రతిబ్యాచ్ నుంచి ఇద్దరు ప్రతినిధులను (పూర్వ విద్యార్థులు) కళాశాలతో సంబంధాలు బలోపేతం చేయడానికి, విద్యావేత్తలు, పరిశోధనలు, పరిశ్రమలలో సహకారాన్ని ప్రోత్సహించడానికి నియమించారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి



శ్రీకాళహస్తి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి(52) మృతి చెందాడు. ఈ ఘటన శుక్రవారం తొట్టంబేడు మండలం బీడీ కాలనీ వద్ద శ్రీకాళహస్తి -తడ రహదారిపై జరిగింది. స్థానికుల కథనం మేరకు..గుర్తుతెలియని వ్యక్తి బుచ్చినాయుడుకండ్రిగ వైపు నుంచి శ్రీకాళహస్తి పట్టణానికి ద్విచక్ర వాహనంపై వెళుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని వెళ్లిపోయింది. ద్విచక్ర వాహనదారుడు అక్కడికక్కడే మృతిచెందాడు. తొట్టంబేడు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని శ్రీకాళహస్తి ఏ రియా ఆస్పత్రికి తరలించారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

శ్రీకాళహస్తిలో ఘనంగా స్కార్ఫ్‌డే



స్కార్ఫ్ ధరింపజేస్తున్న దృశ్యం

శ్రీకాళహస్తి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బాబుఅగ్రహారం పురపాలక సంఘ ఉన్నత పాఠశాలలో శుక్రవారం స్కార్ఫ్‌డేను ఘనంగా నిర్వహించారు. హెచ్ఎం శ్రీదేవికి స్కౌట్‌మాస్టర్ అజారుద్దీన్ స్కార్ఫ్ వేసి దాని విశిష్టతను వివరించారు. స్కౌట్ విద్యార్థులు పాల్గొన్నారు.

స్కౌట్ అండ్ గైడ్స్‌తో విద్యార్థులకు క్రమశిక్షణ

బుచ్చినాయుడుకండ్రిగ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): స్కౌట్ అండ్ గైడ్స్‌తో విద్యార్థులలో క్రమశిక్షణతో పాటుగా విలువలు వస్తాయని ప్రధానోపాధాయులు రమణయ్య తెలిపారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రపంచ స్కార్ఫ్ డేను స్కౌట్ మాస్టర్ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం స్కౌట్‌లో ప్రవేశం పూర్తి చేసిన విద్యార్థులకు ఉపాధ్యాయుడు ధనంజయ స్కార్ఫ్‌ను అందించారు.

యూనిఫాం వితరణ



వరదయ్యపాళెం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): వరదయ్యపాళెం హైస్కూల్ ప్లస్ చదువుతున్న 20 విద్యార్థినులకు అంబూరుకు చెందిన ఎన్ఆర్ఐ ఆణిముత్యం నందకిశోర్‌రెడ్డి తన సొంత నిధులను వెచ్చించి యూనిఫాంను వితరణగా అందించారు. శుక్రవారం పాఠశాలలో జరిగిన ఒక కార్యక్రమంలో హెచ్ఎం రమణయ్య చేతుల మీదుగా యూనిఫాం పంపిణీ చేశారు. దాత నందకిశోర్‌రెడ్డిని పాఠశాల ఉపాధ్యాయులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో వాణి, త్రిమూర్తి, మోహనాచారి, రవి, గోకుల కృష్ణ, కుట్టిబాబు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు 'అన్నదాత సుఖీభవ'

సత్యవేడు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): సత్యవేడులోని బేరివారి కళ్యాణ మండపంలో శనివారం అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ యోజన నియోజకవర్గ స్థాయి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వ్యవసాయశాఖ ఏవో శుక్రవారం మురళి ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే ఆదిమూలం ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని తెలిపారు.

శేష వాహనంపై కల్యాణ వీరభద్రస్వామి



నారాయణవనం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): నారాయణవనం మండలంలో కొలువైన భద్రకాళీ సమేత కల్యాణ వీరభద్రస్వామి వారి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి వారు శేష వాహనంపై ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. ఉదయం స్వామివారిని నిత్య పూజాలు నిర్వహించి, స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంత రం ప్రత్యేక పుష్పాలంకరణ చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఉదయం 9.30 గంటలకు స్నపన తిరుమంజనం నిర్వహి చారు. సాయంత్రం శేష వాహనంపై ఊరేగించారు. ఏఈవో రవి, ఆలయాధికారి నాగరాజు పాల్గొన్నారు.

తాగునీటి బోరుకు అడ్డంగా గోడ

పిచ్చాటూరు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోవర్ధనగిరి దళితవాడలో ఆ గ్రామానికి తాగునీరు అందించే బోరుబావికి అడ్డంగా అదే గ్రామానికి చెందిన సుమతి శంకర్ ప్రభుత్వ భూమిని ఆక్రమించి గోడ నిర్మించాడు. బోరుకు వెళ్లే దారిని పూర్తిగా మూసివేశాడని గ్రామస్తులు పేర్కొంటున్నారు. రెవెన్యూ అధికారులు స్పందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అభివృద్ధికి మారుపేరు బొజ్జల పాలన



పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తిలో బొజ్జల పాలన అంటే అభివృద్ధికి మారుపేరు అని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. శ్రీకాళహస్తిలో శుక్రవారం రెండు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామి అమ్మవారిని కైలాసగిరి ప్రదక్షిణగా సాగే దేవుని బాటలో రూ.7కోట్లు నిధులతో కాంక్రీట్‌రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అనంతరం శ్రీకాళహస్తి పట్టణ శివారు అర్ధనారీశ్వరాలయ సమీపం నుంచి ముక్కంటి ఆలయ వద్ద సన్నిధి వీధి వరకు శివం టు శివం రోడ్డుపనులకు భూమిపూజ చేసి శిలాఫలకం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి మాట్లాడుతూ మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి హయాంలో ప్రతిపాదించిన శివం టు శివం రోడ్డు, గిరిప్రదక్షిణ మార్గంలో కాంక్రీట్‌రోడ్డు పనులను తాను ప్రారంభించడం సంతోషకరంగా ఉందన్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన ఏడాదిలోనే శ్రీకాళహస్తిలో అభివృద్ధి పనులను పరుగులు పెట్టిస్తున్నామ న్నారు. ఈ కార్యక్రమంలో ముక్కంటి ఆలయ ఈవో బాపిరెడ్డి, పట్టణాధ్యక్షుడు విజకుమార్‌నాయుడు, టీడీపీ నాయకులు చెంచయ్యనాయుడు, బాలాజీరెడ్డి, కాసరం రమేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాలనపై ప్రజల్లో ఆనందం : ఎమ్మెల్యే ఆదిమూలం



నారాయణవనంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

నారాయణవనం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఏడాది పాలనపై ప్రజల్లో ఆనందం వెల్లి విరుస్తోందని సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం అన్నారు. శుక్రవారం అరణ్యంకండ్రిగ పంచాయతీలో ఆయన పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సుమన్‌కుమార్, టీడీపీ నాయకులు ఆర్‌డీ ఏకాంబరం, మాజీ ఎంపీపీలు గోవిందస్వామి, భక్తవత్సలం, సర్పంచ్ మురళి, జయచంద్రనాయుడు, ఊరప్ప, శ్రీనివాసయాదవ్, కేఎస్ రవి, పంచాయితీ కార్యదర్శి సుజన, తదితరులు పాల్గొన్నారు.

150 వితంతు పింఛన్ల పంపిణీ

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో నూతనంగా మంజూరైన 150 వితంతు పింఛన్లను టీడీపీ మండల అధ్యక్షుడు సుధాకర్‌నాయుడు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవినాయుడు, ఉషారాణి, సుబ్బారావు, జనార్ధన్‌నాయుడు, బాబు నాయుడు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

పిచ్చాటూరు: పిచ్చాటూరులోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన నాణ్యతను ఎమ్మెల్యే ఆదిమూలం పరిశీలించారు. రుచిచూసి సంతృప్తి వ్యక్తపరచారు. అనంతరం నీరువాయిలో పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ ఇళంగోవన్‌రెడ్డి, నాయకులు పద్మరాజు, సుమాంజలి, బుజ్జినాయుడు, డిల్లీ, రాజేశ్వరి పాల్గొన్నారు. ● మండలంలోని 21 గ్రామ పంచాయతీల్లో సచివాలయ సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు, గ్రామ కార్యదర్శులు, వీఆర్‌వోల సహకారంతో పింఛన్లు పంపిణీ చేశారు. నూతనంగా మండలానికి 85 వితంతు పింఛన్లు మంజూరయ్యాయి.

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం

ఏర్పేడు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): తల్లిపాలే బిడ్డలకు శ్రేయస్కరమని సీడీపీవో కృష్ణవేణి తెలియజేశారు. ఏర్పేడు మండలం పల్లంపేట, అంజిమేడు అంగన్వాడీ కేంద్రాల్లో శుక్రవారం జరిగిన తల్లిపాల వారోత్సవాలలో ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్‌వైజర్ రత్నమ్మ, కార్యకర్తలు పాల్గొన్నారు.

సత్యవేడు / వరదయ్యపాళెం: తల్లిపాలే బిడ్డకు శ్రేష్ఠమని సత్యవేడు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో దేవకుమారి తెలిపారు. మండలంలోని ఇరుగుళం అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం ఐసీడీఎస్ సూపర్ వైజర్ చెంచులక్ష్మీ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ ప్రతి తల్లి తమ పిల్లలకు ముర్రుపాలను తప్పకుండా తాగించాలని కోరారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అంగన్వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు. ● వరదయ్యపాళెం మండలం కాంబాకం అంగన్వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శిల్ప ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పవన్, ఎంపీహెచ్ఏ రవీంద్ర, సూపర్‌వైజర్ పవనకుమారి, ఎంఎల్‌హెచ్‌పీ బేబి, ఏఎన్ఎం కామేశ్వరి, అంగన్వాడీ కార్యకర్తలు లీలా, ఆశాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ: బిడ్డకు తల్లిపాలు ఔషధమని తప్పకుండా తల్లి పాలు పట్టించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు యమున, జ్యోతి తెలిపారు. తల్లిపాల వారోత్సవాలను శుక్రవారం నీర్పాకోట గిరిజన కాలనీలోని అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించారు.

5న పాలిటెక్నిక్ స్పాట్ అడ్మిషన్లు

సత్యవేడు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): సత్యవేడు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో వివిధ కోర్సులలో మిగిలిపోయిన సీట్ల భర్తీకి ఈ నెల 5వ తేదీన స్పాట్ అడ్మిసన్‌లు నిర్వహించన్నుట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఉషాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో ఈసీఈ 46, మెకానికల్ ఇంజనీరింగ్ 62, సివిల్ ఇంజనీర్ 63 సీట్లు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు 2025 పాలిసెట్ హాల్ టికెట్, ర్యాంకు కార్డు, టెన్త్ మార్క్‌లిస్ట్, టీసీ, ఎస్సీ, ఎస్టీ, బీసీ కుల ధృవీకరణ పత్రాలు, నాల్గవ తరగతి నుండి టెన్త్ వరకు స్టడీ సర్టిఫికెట్, 2025 - 2026 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఈడబ్ల్యుఎస్ సర్టిఫికెట్ తదితర ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు రెండు సెట్ల జిరాక్స్ కాపీలను ఈనెల 4వ తేదీలోపు కళాశాలలో సమర్పించాలని తెలిపారు. దీంతో పాటు స్పాట్ అడ్మిషన్‌లు పొందగోరేవారు ట్యూషన్ ఫీజు రూ. 4700 లు, దరఖాస్తు ఫీజు రూ.400, రిజిస్ట్రేషన్ ఫీజు రూ.750లు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఎస్సీ, ఎస్టీ లు ట్యూషన్ ఫీజు రూ.4700, దరఖాస్తు ఫీజు రూ.200, రిజిస్ట్రేషన్ ఫీజురూ.250 చెల్లించాలని ఆమె వివరించారు.

రామమందిరంలోనే పింఛన్ల పంపిణీ

కేవీబీపురం: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన ఎన్టీఆర్ భరోసా పింఛన్లను లబ్ధిదారులు ఇళ్ల వద్దే అధికారులు పంపిణీ చేయాల్సి ఉంది. అయితే కళత్తూరులో ఒకేచోట రామ మందిరంలో కూర్చుని అక్కడికే పింఛనుదారులను పిలిపించి పంపిణీ చేస్తున్నారు.

తొట్టంబేడు ఎస్ఐపై ఎస్పీకి ఫిర్యాదు

శ్రీకాళహస్తి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): తొట్టంబేడు ఎస్ఐ రామాంజనేయులుపై టీడీపీ నేతలు ఎస్పీకి ఫిర్యాదు చేశారు. వారి కథనం మేరకు.. తొట్టంబేడు మండలం కల్లిపూడికి చెందిన ఓ వైసీపీ నాయకునికి చిన్నసింగమాల గ్రామంలో బంగారు దుకాణం ఉంది. అక్కడ పనిచేసే ఓ యువకుడు మూడు నెలల క్రితం బంగారాన్ని అపహరించాడని వైసీపీ నాయకుడు గురువారం తొట్టంబేడు ఎస్ఐని ఆశ్రయించాడు. చిన్నసింగమాల గ్రామం శ్రీకాళహస్తి రెండవ పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోకి వస్తుంది. తనపరిధిలోకి రాకపోయినా ఎస్ఐ రామాంజనేయులు బంగారు చోరీ చేసిన యువకుడితోపాటు అతని వద్ద కొనుగోలు చేసిన యువకుడిని స్టేషన్‌కు పిలిపించారు. బంగారు కొనుగోలు చేసిన యువకుడు, వ్యాపారి అయిన వైసీపీ నేత మధ్య రూ.2లక్షల నగదుకు సెటిల్‌మెంట్ కుదిరింది. దీనిపై శుక్రవారం కొందరు టీడీపీ నాయకులు ఎస్ఐ రామాంజనేయులు కలిశారు. నీ పరిధిలోకి రాని కేసును ఎందుకు స్వీకరించి సెటిల్ చేశారని ప్రశ్నించారు. ఆయన దురుసుగా సమాధానం చెప్పాడు. దాంతో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డివారి గురవారెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు గాలి చలపతి నాయుడు, దశరథాచారి తదితరులు శుక్రవారం తొట్టంబేడు పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని ఎస్ఐతో మాట్లాడేందుకు వెళ్లారు. వారికీ అలాగే సమాధానం ఎదురైంది. డీఎస్పీ ఆదేశాలతో బుచ్చినాయుడుకండ్రిగ సీఐ తిమ్మయ్య స్టేషన్ వద్దకు చేరుకుని ఎస్ఐపై లిఖితపూర్వకంగా చేస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం టీడీపీ నాయకులు ఎస్పీకి ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశారు. అలాగే సీఎం చంద్రబాబుకు, మంత్రి లోకేశ్‌కు, డీజీపీలకు మెయిల్‌ద్వారా ఫిర్యాదు చేశారు.

చెరువులో పడి యువకుడి మృతి

సత్యవేడు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): చెరువులో పడి యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్ఐ రామస్వామి కథనం మేరకు.. పట్టణానికి చెందిన జేమ్స్ (30) తన తల్లితో కలిసి దళితవాడలో ఉంటున్నాడు. చిన్న చిన్న పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. మూడు రోజుల క్రితం దళవాయి అగ్రహారంలోని చెరువులో స్నానం కోసం వెళ్లాడు. మద్యం మత్తులో లోతుకు వెళ్లి ఊపిరాడక మృతి చెందాడు. శుక్రవారం ఉదయం చెరువులో తేలుతున్న మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేమాన్ని వెలికితీశారు.

108 చీరలతో ముత్యాలమ్మకు అలంకరణ



శ్రీకాళహస్తి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా వెలసిన ముత్యాలమ్మ అమ్మవారికి శుక్రవారం 108 చీరలతో ప్రత్యేక అలంకరణ చేపట్టారు. భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఐఐటీని సందర్శించిన ఏఎన్ఆర్ఎఫ్ సీఈవో



మాట్లాడుతున్న శివకుమార్ కల్యాణ రామన్

ఏర్పేడు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఐఐటీని శుక్రవారం ఏఎన్ఆర్ఎఫ్ సీఈవో డాక్టర్ శివకుమార్ కల్యాణ రామన్ సందర్శించారు. ఆయన అధ్యాపకులతో కలిసి సంయుక్త పరిశోధన, డీప్ టెక్, ఆర్అండ్‌డీ వ్యూహాలు, కన్వర్జెన్ సీవోఈఎస్, పీఎం ఈసీఆర్‌జీ పథకం వంటి అంశాలపై చర్చించారు. మెడ్‌టెక్ వాతావరణం, స్థిరత్వం, స్మార్ట్ మౌలిక వసతులు, మహా ఈవీ మిషన్ వంటి జాతీయ సవాళ్ల పరిష్కారాలపై దృష్టిసారించారు. ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

జాతీయ రెజ్లింగ్, గ్రాప్లింగ్ పోటీలలో బంగారు పతకాలు



విజయం సాధించిన విద్యార్థినులను అభినందిస్తున్న ఉపాధ్యాయురాలు

రేణిగుంట ఆగస్టు 1 (ఆంధ్ర జ్యోతి): జాతీయస్థాయి రెజ్లింగ్, గ్రాప్లింగ్ పోటీలలో బంగారు వెండి, రజత పతకాలను జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్లస్ టు విద్యార్థినిలు సాధించారు. దీంతో శుక్రవారం పాఠశాల ఆవరణలో హెచ్ఎం శ్యామల, పీడీ పద్మ, పాఠశాలలోని ఉపాధ్యాయులు వారిని అభినందించారు.

కేంద్రమంత్రి గడ్కరీకి ఘన స్వాగతం



కేంద్ర మంత్రి గడ్కరీకి స్వాగతం పలుకుతున్న మంత్రి, కలెక్టర్, శ్రీకాళహస్తి, తిరుపతి ఎమ్మెల్యేలు, బీజేపీ నాయకులు

రేణిగుంట ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): కేంద్ర రోడ్డు, జాతీయ రహదారుల మంత్రి నితిన్ గడ్కరీకి తిరుపతి విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. శ్రీవారి దర్శనార్థం కేంద్ర మంత్రి కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం రాత్రి పూణే నుంచి ప్రత్యేక విమానంలో తిరుపతి విమానాశ్రయం చేరుకున్నారు. ఆయనకు మంత్రి జనార్దన్ రెడ్డి, కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, శ్రీకాళహస్తి, తిరుపతి ఎమ్మెల్యేలు బొజ్జల సుధీర్ రెడ్డి, ఆరణి శ్రీనివాసులు, జాయింట్ కలెక్టర్ శుభం బన్సాల్, టీటీడీ బోర్డు మెంబర్ భానుప్రకాష్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ తదితరులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన రోడ్డు మార్గాన తిరుమలకు బయలుదేరి వెళ్లారు. అక్కడ రాత్రి బస చేసి శనివారం ఉదయం శ్రీవారిని దర్శించుకున్న అనంతరం రోడ్డు మార్గన తిరుచానూరుకు చేరుకొని అమ్మవారిని దర్శించుకుంటారు. అక్కడినుంచి కంచి కామకోటి పీఠం చేరుకొని అక్కడ జరిగే పూజా కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం మధ్యాహ్నం తిరుపతి విమానాశ్రయం చేరుకొని ప్రత్యేక విమానంలో విజయవాడకు బయలుదేరి వెళ్లనున్నారు.

కేంద్ర మంత్రికి సుధీర్‌రెడ్డి వినతి

శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి నియోజకవర్గ అభివృద్ధి పనులపై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి వినతిపత్రం అందజేశారు. గుడిమల్లం ఆలయ విశిష్టను కేంద్రమంత్రికి వివరించారు. గుడిమల్లం ఆలయ చరిత్రకు సంబంధించిన పుస్తకాన్ని అందజేశారు.